




అనుక్షణం ప్రజల పక్షం

RNI NO: TELTEL/2023/87607

# జర్నలిస్ట్ వార్త

తెలుగు దిన పత్రిక..








సంపుటి - 2 సంచిక - 248 గురువారం 25 డిసెంబర్ 2025 ఎడిటర్ : బిర్రు కరుణాకర్ పేజీలు -6 వెల - 5/-

Published From Warangal : Cerculated in Hyderabad Rangareddy,Nalgonda,Khammam,Warangal,Mahaboobnagar,Medak and All Distircts


## మూడు కొత్త ఎయిర్‌లైన్స్‌కు గ్రీన్ సిగ్నల్



**ఇండిగో సంక్షోభం తర్వాత కేంద్రం కీలక నిర్ణయం:**

**శంఖ్ ఎయిర్, అల్ హింద్ ఎయిర్, ఫ్లైఎక్స్‌ప్రెస్‌కు ఎన్ఓసీలు జారీ**

**మరిన్ని సంస్థలను ప్రోత్సహిస్తున్నామని మంత్రి రామ్మోహన్ నాయుడు వెల్లడి**

**డిసెంబర్24(జర్నలిస్ట్ వార్త):** దేశీయ విమానయాన రంగంలో సంచలనం సృష్టించిన ఇండిగో సంక్షోభం నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం కీలక చర్యలకు ఉపక్రమించింది. విమానయాన మార్కెట్లో పోటీని పెంచి, రెండు ప్రధాన సంస్థల ఆధిపత్యానికి అడ్డుకట్ట వేసే దిశగా మరో మూడు కొత్త ఎయిర్‌లైన్స్ ప్రవేశానికి మార్గం సుగమం చేసింది. మిగతా 2లో...



# కేసీఆర్‌కు మళ్లీ అధికారం కల్లే!

## కొడంగల్ సభలో కెసిఆర్‌పై ఘాటు విమర్శలు చేసిన రేవంత్

**రాష్ట్రంలో బిఆర్ఎస్, కెసిఆర్ ఇక గత చరిత్రే**

**కేసీఆర్‌వి సోయిలేని మాటలు.. స్థాయిలేని విమర్శలు**

**వరుస ఓటములు ఎదురయినా సిగ్గురాలేదా**

**నన్నూ..నా కుటుంబాన్ని ఇబ్బంది పెట్టినా పట్టించుకోలే**

**కిందిస్థాయి నుంచి వచ్చి సిఎంగా అయ్యా**



మహబూబ్‌నగర్, **డిసెంబర్24(జర్నలిస్ట్ వార్త):** తాను రాజకీయాల్లో ఉన్నంతకాలం కేసీఆర్, ఆయన కుటుంబానికి అధికారం దక్కనివ్వనని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి శపథం చేశారు. మంతరిగా, కేంద్రమంత్రిగా, సిఎంగా పదేళ్లు పనిచేసిన కెసిఆర్ నాలుగు మంచి మాటలు చెప్పకుండా తోలు తీస్తానంటూ చేసిన వ్యాఖ్యలపై మండిపడ్డారు. నీలాగా తిట్టుడు మొదలు పెడితే తట్టుకోలేవు కెసిఆర్ అంటూ హెచ్చరికలు చేశారు. మిగతా 2లో...

## బాహుబలి రాకెట్ ప్రయోగం విజయవంతం

**మరో మైలురాయిని అందుకున్న ఇస్రో**

**అమెరికా పెట్టుకున్న నమ్మకాన్ని నిలబెట్టామన్న ఇస్రో చైర్మన్**



తిరుపతి, **డిసెంబర్24(జర్నలిస్ట్ వార్త):** భారత అంతరిక్ష పరిశోధాన సంస్థ ఇస్రో మరో మైలురాయిని చేరింది. శ్రీహరి కోటలో బాహుబలి రాకెట్ ప్రయోగం విజయవంతం అయ్యింది. అమెరికాకు చెందిన భారీ కమ్యూనికేషన్ శాటిలైట్ బ్లూ బర్డ్ బ్లాక్-2ను ఈ రాకెట్ విజయవంతంగా నింగిలోకి తీసుకెళ్లింది. తొలిసారిగా ఇంతటి భారీ ఉపగ్రహాన్ని ఇస్రో నింగిలోకి పంపింది. కేవలం 15 నిమిషాల్లోనే బ్లూబర్డ్ ప్రయోగం విజయవంతమైంది. అమెరికాకు చెందిన ఏఎస్‌టీ స్పేస్ మొబైల్ సంస్థతో కలిసి ఇస్రో ఈ ప్రయోగం నిర్వహించింది. మిగతా 2లో...

## సంక్రాంతికి గ్రామాల్లో అన్న క్యాంటీన్లు

**గ్రామీణ ప్రాంతాల్లో సంక్రాంతి కానుకగా ప్రారంభం కానున్న 70 అన్న క్యాంటీన్లు**

**జనవరి 13 నుంచి 15 మధ్య క్యాంటీన్లు ప్రారంభించే యోచనలో ప్రభుత్వం**

**పట్టణ ప్రాంతాల్లో ఇప్పటికే కొనసాగుతున్న 205 క్యాంటీన్లు**




విజయవాడ,**డిసెంబర్24(జర్నలిస్ట్ వార్త):)** గ్రామీణ ప్రజలకు సంక్రాంతి కానుకగా ఏపీ ప్రభుత్వం అన్న క్యాంటీన్లు ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తోంది. రాష్ట్ర వ్యాప్తంగా గ్రామీణ నియోజకవర్గ, మండల కేంద్రాల్లో ఒకేసారి 70 అన్న క్యాంటీన్లు ప్రారంభించనున్నట్లు తెలిపింది. మిగతా 2లో...

## 2029 ఎన్నికల్లో పోటీకి సిద్ధం

### బాపు పిలిచినా బీఆర్ఎస్‌లోకి వెళ్లను

**-ప్రజా సమస్యల పరిష్కారం కోసం పోరాటం**

**తెలంగాణ జాగృతి అధ్యక్షులు కల్వకుంట్ల కవిత -యాదాద్రి భువనగిరిలో స్వర్ణకారులను కలిసిన ఎమ్మెల్సీ**

భువనగిరి **డిసెంబర్24(జర్నలిస్ట్ వార్త):** ”నేను ఎవరూ వదిలిన బాణాన్ని కాదు.. ప్రజలు వదిలిన బాణాన్ని.. ప్రజల సమస్యల పరిష్కారం కోసం పోరాటం చేస్తా.. నన్ను మళ్లీ బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ స్వయంగా పార్టీలోకి రావాలని పిలిచినా వెళ్లేది లేదు.. కారణం చెప్పకుండా.. నేను చేసిన తప్పేమిటో చెప్పకుండా సస్పెండ్ చేసి బయటకు గెంటేశారు..” అని తెలంగాణ జాగృతి అధ్యక్షులు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితఅన్నారు. తనను ఆపరేట్ చేసే అంత సీన్ ఎవరికీ లేదన్నారు. 2029 ఎన్నికల్లో స్వతంత్రంగానే పోటీ చేస్తానని ప్రకటించారు. మిగతా 2లో...



## పవన్ కల్యాణ్.. దాతృత్వం

### మూడేళ్ల హామీ నెరవేర్చిన డిప్యూటీ సీఎం

**ఇచ్చిన మాట ప్రకారం ఇండ్ల నాగేశ్వరమ్మను కలిసిన జనసేనాని**

**ఆమెకు రూ.50 వేల సాయం, మనవడి చదువుకు రూ.లక్ష ప్రకటన**

**ప్రతి నెలా రూ.5 వేల వ్యక్తిగత సహాయానికి హామీ ఇచ్చిన పవన్**

**ఇప్పటం గ్రామంలో భావోద్వేగ వాతావరణం**




2లో.

## నీటి ద్రోహంపై జవాబు చెప్పలేక నిక్కృష్టపు మాటలు

**రైతులు ఆత్మహత్యలు చేసుకుంటున్నా చలనం లేని సిఎం**

**ఎక్స్ వేదికగా మండిపడ్డ కెటిఆర్**

హైదరాబాద్, **డిసెంబర్24(జర్నలిస్ట్ వార్త):** 2028లో తెలంగాణ ప్రజలు కాంగ్రెస్ పార్టీని బొంద పెట్టడం ఖాయమని భారత రాష్ట్ర సమితి కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ అన్నారు. కోస్గి సభలో సీఎం రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలపై కేటీఆర్ మండిపడ్డారు. నీటి ద్రోహంపై జవాబు చెప్పలేక నికృష్టపు మాటలు మాట్లాడుతున్నారని ’ఎక్స్’ వేదికగా ధ్వజమెత్తారు. ‘జల హక్కులను కాపాడటం రేవంత్‌రెడ్డికి చేతకాదు. పాలమూరు ప్రాజెక్టు గొంతుకోసి.. సొంత జిల్లానే దగా చేస్తున్నారు. తెలంగాణ సోయిలేని.. రాష్ట్ర ప్రయోజనాలు రక్షించలేని వ్యక్తి రేవంత్‌రెడ్డి. శాసన సభలో.. జనసభలో ప్రతిచోటా కాంగ్రెస్ జలద్రోహాన్ని ఎండగడతాం. జనం అన్నీ గమనిస్తున్నారు.. మిగతా 2లో...



## పి పి పి విధానంపై వెనకడుగులేదు


**పేదలకు నాణ్యమైన వైద్యంలో రాజీలేదు**


**పిపిపి విధానం దేశవ్యాప్తంగా అమలువుతోంది**

**విమర్శలను సమర్థంగా తిప్పి కొట్టాల్సిందే**

**అధికారులతో సమీక్షలో సిఎం చంద్రబాబు స్పష్టీకరణ**

అమరావతి, **డిసెంబర్24(జర్నలిస్ట్ వార్త):** పేదలకు నాణ్యమైన వైద్యంలో రాజీలేదని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. వైద్య ఆరోగ్య శాఖపై సమీక్ష నిర్వహించిన సీఎం.. పీపీపీ విధానంపై ముందుకేనని తేల్చి చెప్పారు. తప్పుడు ప్రచారాన్ని తిప్పికొట్టాలని సూచించారు. కేంద్రం మార్గదర్శకాల మేరకు వీజీఎఫ్‌కు నిర్ణయం తీసుకున్నామన్నారు. వీజీఎఫ్ కింద కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు 30 శాతం చొప్పున ఆర్థిక మద్దతు ఉంటుందని తెలిపారు. టెండర్ల ప్రక్రియను వేగవంతం చేయాలని ఆదేశించారు. ఆంధ్రప్రదేశ్‌లో మెడికల్ కాలేజీల వ్యవహారం కూటమి సర్కార్, వైసీపీ మధ్య తీవ్రమైన యుద్ధానికే తెరలేపింది.. పీపీపీ మోడ్‌ను వ్యతిరేకిస్తూ వైసీపీ పెద్ద ఎత్తున ఆందోళన, నిరసన కార్యక్రమాలు నిర్వహించి.. చివరకు కోటికి పైగా సంతకాలను గవర్నర్‌కు అందజేసిన విషయం విదితమే కాగా.. మిగతా 2లో...





## కరుణామయుడి జన్మదినం

ప్రపంచవ్యాప్తంగా వందల కోట్ల మందికి సంబరం.

6లో.

# బాహుబలి రాకెట్ ప్రయోగం విజయవంతం

(మొదటి పేజి తరువాయి)

ప్రపంచంలో ఎక్కడి నుంచైనా 4.జి, 5జి సేవలను బ్లూ బార్డ్ బ్లాక్-2 అందించనుంది. ఎల్‌వీఎం 3 రాకెట్ సిరీస్‌లో ఇది 9వ ప్రయోగం. ఈ సందర్భంగా ఇస్రో చైర్మన్ నారాయణన్ మాట్లాడుతూ.. బాహుబలి ప్రయోగం విజయవంతమైందన్నారు. ఎల్‌వీఎంప్రయోగాల్లో సంపూర్ణ విజయాలు సాధిస్తున్నామని తెలిపారు. అతి తక్కువ సమయంలో రాకెట్ రూపొందించి విజయవంతం చేశామన్నారు. అమెరికన్ కస్టమర్ కోసం ప్రయోగం చేపట్టామని చెప్పారు. ప్రపంచంలో అత్యుత్తమ ప్రయోగాల్లో ఇది ఒకటన్నారు. 34 దేశాలకు ఇస్రో సేవలందిస్తోందని అన్నారు. గగన్‌యాన్ కోసం ఈ ప్రయోగం మరింత ఆత్మవిశ్వాసం కలిగిస్తోందని తెలిపారు. ఇస్రోపై అమెరికా పెట్టుకున్న నమ్మకాన్ని నిలబెట్టామని ఇస్రో చైర్మన్ తెలిపారు. ఈ ప్రయోగం ఇస్రోకి చారిత్రాత్మకమైన విజయమన్నారు. వాణిజ్య ప్రయోగాలలో మరోసారి సత్తా చాటామని తెలిపారు. అత్యంత కీలకమైన ఈ ప్రయోగం 52 రోజుల్లోనే సిద్ధం చేసి ప్రయోగం చేపట్టామని చెప్పారు. మన శాస్త్రవేత్తల సమిష్టి విజయం.. ఎల్‌వీఎం 3 - ఎం 6 రాకెట్ ప్రయోగం అని చెప్పుకొచ్చారు. ఈ ప్రయోగ విజయం తమకు అత్యంత ధైర్యాన్ని కల్పించిందన్నారు. ఎల్‌వీఎం ప్రయోగాలలో ఈ ప్రయోగం మూడవ వాణిజ్య ప్రయోగమని వెల్లడించారు. ఎల్‌వీఎం రాకెట్లనే చంద్రయాన్ 4, 5కు ఉపయోగిస్తున్నామన్నారు. భవిష్యత్తులో మానవ రహిత ప్రయోగాలని చేపట్టబోతున్నామని ప్రకటించారు. వాణిజ్య ప్రయోగ ఒప్పందాలు పూర్తయిన వెంటనే వరస వాణిజ్య ప్రయోగాలని చేపడుతున్నామన్నారు. భవిష్యత్తులో నావిగేషన్ ప్రయోగాలు, అంతరిక్షంలో స్పేస్ స్టేషన్‌ను ఏర్పాటు చేస్తున్నామని ఇస్రో చైర్మన్ నారాయణన్ పేర్కొన్నారు.

## నీటి ద్రోహంపై జవాబు చెప్పలేక
# నిక్కృష్టపు మాటలు

సందర్భం వచ్చినప్పుడు తొక్కి నారతీస్తారు‘ అని కేటీఆర్ అన్నారు. రెండేళ్ల కాంగ్రెస్ పాలనలో 750 మందికి పైగా రైతులు మరణించినా సీఎం రేవంత్ రెడ్డికి కనీసం చీమ కుట్టినట్టు కూడా లేదని కేటీఆర్ విమర్శించారు. పంట కొనే దిక్కులేక కొనుగోలు కేంద్రం వద్దే జమ్మన్న అనే రైతు గుండెపోటుతో కుప్పకూలి మరణించడం అత్యంత బాధాకరమని పేర్కొన్నారు. గద్వాల జిల్లా మానవపాడు మండలంలోని కలుకుంట్ల మొక్కజొన్న కేంద్రం వద్ద జరిగిన ఈ ఘటనకు పూర్తి బాధ్యత ముఖ్యమంత్రిదే అని చెప్పారు. నాలుగు రోజులుగా పడిగాపులు పడుతున్నా కూడా మొక్కజొన్న పంట కొనకుండా కాంగ్రెస్ సర్కారు అన్నదాత నిండు ప్రాణాన్ని బలితీసుకుందన్నారు. ఓ వైపు పెట్టుబడి సాయం అందక అప్పుల పాలై రైతులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారని, మరోవైపు భారీ వర్షాలతో పంట నష్టపోయినా కూడా కనీసం పరిహారం అందక కౌలు రైతులు సైతం బలవన్మరణాలకు పాల్పడుతున్నారని చెప్పారు. ఇంకోవైపు పనికిరాని యాప్‌లతో యూరియా అందక అన్నదాతలు మళ్లీ ఈ సీజన్‌లోనూ అష్టకష్టాలు పడుతున్నారన్నారు. దేళ్లపాటు సంతోషంగా సాగిన సాగును కన్నీటి సేద్యంగా మార్చి.. వ్యవసాయ రంగాన్ని పూర్తిగా సంక్షోభంలోకి నెట్టిన ఈ పాపం ఊరికే పోదని చెప్పారు. కొనుగోలు కేంద్రాల వద్ద పడిగాపులు పడుతున్న రైతుల కష్టాలు తీర్చేందుకు ఇప్పటికైనా రేవంత్ సర్కార్ మొద్దు నిద్ర వీడాలని అన్నారు. ముఖ్యమంత్రి నిర్వాకంతో ఇవాళ గుండె పగిలి మరణించిన జమ్మన్న కుటుంబానికి రూ. 25లక్షల పరిహారం అందిచాలని కేటీఆర్ డిమాండ్ చేశారు.

## మూడు కొత్త ఎయిర్‌లైన్స్‌కు గ్రీన్ సిగ్నల్

(మొదటి పేజి తరువాయి)

శంఖ్ ఎయిర్, అల్ హింద్ ఎయిర్, ఫ్లైఎక్స్‌ప్రెస్ అనే మూడు సంస్థలకు నిరభ్యంతర పత్రాలు జారీ చేసినట్లు కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు ప్రకటించారు. ఈ నెల ఆరంభంలో కొత్త ఫ్లైట్ డ్యూటీ టైమ్ లిమిటేషన్) నిబంధనల కారణంగా ఇండిగో ఎయిర్‌లైన్స్ తీవ్రమైన సిబ్బంది కొరతను ఎదుర్కొంది. ఫలితంగా, కేవలం వారం రోజుల్లోనే 5,000కు పైగా విమాన సర్వీసులను రద్దు చేయాల్సి వచ్చింది. ఈ పరిణామం దేశవ్యాప్తంగా ప్రయాణికులను తీవ్ర ఇబ్బందులకు గురిచేయడమే కాకుండా, దేశీయ విమానయాన రంగంలో కేవలం ఒకటి, రెండు సంస్థలపై ఆధారపడటంలోని ప్రమాదాలను బహిర్గతం చేసింది. ఈ నేపథ్యంలోనే ప్రభుత్వం కొత్త సంస్థలను ప్రోత్సహించేందుకు వేగంగా అడుగులు వేసింది. ఈ విషయాన్ని కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు తన ‘ఎక్స్’ (ట్విట్టర్) ఖాతా ద్వారా వెల్లడించారు. “గత వారం రోజులుగా భారత గగనతలంలోకి అడుగుపెట్టాలని ఆశిస్తున్న శంఖ్ ఎయిర్, అల్ హింద్ ఎయిర్, ఫ్లైఎక్స్‌ప్రెస్ బృందాలతో సమావేశమవడం సంతోషంగా ఉంది. శంఖ్ ఎయిర్‌కు ఇప్పటికే ఎన్‌ఓసీ లభించగా, అల్ హింద్ ఎయిర్, ఫ్లైఎక్స్‌ప్రెస్‌లకు ఈ వారం ఎన్‌ఓసీలు మంజూరు చేశాం,” అని ఆయన తెలిపారు. ప్రపంచంలోనే అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న భారత విమానయాన మార్కెట్లో మరిన్ని సంస్థలను ప్రోత్సహించడమే తమ లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు. “ప్రధానమంత్రి మోదీ విధానాల మేరకు, ఉడాన్ వంటి పథకాల ద్వారా ఇప్పటికే స్టార్ ఎయిర్, ఇండియా వన్ ఎయిర్, ఫ్లై91 వంటి చిన్న సంస్థలు ప్రాంతీయ కనెక్టివిటీలో కీలక పాత్ర పోషిస్తున్నాయి. ఈ రంగంలో వృద్ధికి ఇంకా ఎంతో అవకాశం ఉంది,” అని రామ్మోహన్ నాయుడు వివరించారు.

## సంక్రాంతికి గ్రామాల్లో అన్న క్యాంటీన్లు

(మొదటి పేజి తరువాయి)

ప్రస్తుతం వివిధ దశల్లో ఉన్న క్యాంటీన్ల నిర్మాణ పనులు జనవరి 10లోగా పూర్తి చేయనుండగా, జనవరి 13 నుంచి 15 మధ్య క్యాంటీన్లు ప్రారంభించే యోచనలో ప్రభుత్వం ఉంది.

కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత ఇప్పటికే పట్టణ ప్రాంతాల్లో 205 అన్న క్యాంటీన్లు ప్రారంభించి కొనసాగిస్తున్న సంగతి తెలిసిందే. వీటిలో రోజూ మూడు పూటలా కలిపి 2 లక్షల మందికిపైగా ప్రజలు భోజనం చేస్తున్నారు. ఉదయం, రాత్రి అల్పాహారం, మధ్యాహ్నం భోజనాన్ని పూటకు రూ. 5కే అందిస్తున్నారు. గ్రామీణ ప్రాంతాల్లోనూ క్యాంటీన్లు ఏర్పాటు చేయాలన్న ఎమ్మెల్యేల విజ్ఞప్తి నేపథ్యంలో ప్రభుత్వం మరో 70 క్యాంటీన్లను మంజూరు చేసింది.

పట్టణాలు, నగరాల్లో కొనసాగుతున్న 205 అన్న క్యాంటీన్ల ద్వారా ఇప్పటి వరకు 7.20 కోట్ల మందికిపైగా పేదలకు ఆహారం అందించారు. వీరిలో 3.16 కోట్ల మంది మధ్యాహ్న భోజనం చేయగా, 2.62 కోట్ల మంది ఉదయం అల్పాహారం, 1.42 కోట్ల మంది రాత్రి అల్పాహారం పొందారు. విశాఖపట్నం, ఎన్టీఆర్, గుంటూరు జిల్లాల్లో అన్న క్యాంటీన్లకు అత్యధిక స్పందన లభిస్తోంది.

## డీజీపీ శివధర్ రెడ్డి నియామక ఉత్తర్వులు

### రద్దుకు రాష్ట్ర హైకోర్టు నిరాకరణ

### తదుపరి విచారణ జనవరి 20వ తేదీకి వాయిదా




హైదరాబాద్, **డిసెంబర్24(జర్నలిస్ట్ వార్త):** రాష్ట్ర డీజీపీ శివధర్ రెడ్డి నియామక ఉత్తర్వులు రద్దు చేసేందుకు తెలంగాణ హైకోర్టు నిరాకరించింది. రెండు వారాల్లోగా డీజీపీల ప్యానెల్ లిస్టును యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (యూపీఎస్సీ)కి పంపాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని హైకోర్టు ఆదేశించింది. సుప్రీంకోర్టు మార్గదర్శకాలకు అనుగుణంగా డీజీపీ ఎంపిక ఉండాలని హైకోర్టు ఈ సందర్భంగా స్పష్టం చేసింది. ప్యానెల్ లిస్టును యూపీఎస్సీకి పంపిన తర్వాత కౌంటర్ దాఖలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశించింది. ఈ కేసులో తదుపరి విచారణను జనవరి 20వ తేదీకి వాయిదా వేసింది. ఇటీవల తెలంగాణ డీజీపీగా శివధర్ రెడ్డిని రేవంత్ రెడ్డి ప్రభుత్వం నియమించింది. ఈ నియామకాన్ని హైదరాబాద్‌కు చెందిన సోషల్ వర్కర్ టి. మధన్ గోపాల్ రావు హైకోర్టులో సవాల్ చేశారు. ఈ ఏడాది సెప్టెంబర్‌లో ప్రభుత్వం జారీ చేసిన డీజీపీ నియామక ఉత్తర్వులు 2018 నాటి సుప్రీంకోర్టు జారీ చేసిన గైడ్ లైన్స్‌కు పూర్తి వ్యతిరేకమంటూ పిటిషనర్ వ్యక్తిగతం హాజరై ఈ కేసును హైకోర్టులో వాదించారు. డీజీపీ పదవి విరమణకు కనీసం 3 నెలల ముందుగానే యూపీఎస్సీకి రాష్ట్ర ప్రభుత్వం డీజీపీ భర్తీ వివరాలను సమర్పించాల్సి ఉందన్నారు. అర్హులైన ఐపీఎస్ అధికారుల జాబితాను యూపీఎస్సీకి పంపడంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని విమర్శించారు. దాంతో శాశ్వత నియామక ప్రక్రియ ఆగిందని వివరించారు. అనంతరం ఈ పిటిషన్‌పై హైకోర్టు పలుమార్లు విచారణ జరిపింది. తాజాగా డీజీపీ నియామక ఉత్తర్వులు రద్దు చేసేందుకు తెలంగాణ హైకోర్టు నిరాకరించింది.

# పి పి పి విధానంపై వెనకడుగులేదు

(మొదటి పేజి తరువాయి)

ఆంధ్రప్రదేశ్‌లో కొత్తగా నిర్మించనున్న మెడికల్ కాలేజీల టెండర్ల ప్రక్రియపై సీఎం నారా చంద్రబాబు నాయుడు కీలక వ్యాఖ్యలు చేశారు. రాష్ట్రంలో వైద్య విద్య, వైద్య మౌలిక సదుపాయాల కల్పన విషయంలో వెనక్కి తగ్గేదే లేదని ఆయన స్పష్టం చేశారు. అమరావతిలో నిర్వహించిన సమీక్ష సమావేశంలో సీఎం మాట్లాడుతూ.. టెండర్ల ప్రక్రియను మరింత వేగవంతం చేయాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. అంతేకాదు, బిడ్డర్స్ తో నేరుగా సంప్రదింపులు జరపాలన్న సూచన కూడా చేశారు. ఆదోని మెడికల్ కాలేజీ విషయంలో ముందుకొచ్చిన సంస్థతో ఒప్పందం ఖరారు చేయాలని అధికారులను సీఎం ఆదేశించారు. కాలేజీ నిర్మాణం త్వరగా ప్రారంభమయ్యేలా అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. దేశవ్యాప్తంగా పీపీపీ విధానం విజయవంతంగా అమలులో ఉందని గుర్తుచేసిన చంద్రబాబు.. ఏపీలో కూడా మెడికల్ కాలేజీలను అదే విధానంలో నిర్మించి, ప్రజలకు భారంలేకుండా మెరుగైన వైద్య విద్య అందిస్తామని తెలిపారు. మెడికల్ కాలేజీల నిర్మాణం రాష్ట్ర అభివృద్ధిలో కీలకం. ఇందులో రాజీ లేదు. ఆలస్యం లేకుండా ముందుకు వెళ్లాలి అని తేల్చి చెప్పారు సీఎం చంద్రబాబు నాయుడు.. సీఎం వ్యాఖ్యలతో టెండర్ల ప్రక్రియ మరింత వేగం పుంజుకునే అవకాశం కనిపిస్తోంది. వైద్య రంగ విస్తరణలో ప్రభుత్వం దూకుడుగా ముందుకెళుండటంతో.. రాష్ట్రంలో వైద్య విద్యకు కొత్త ఊపు రానుంది అని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. ఆదోని మెడికల్ కాలేజ్ నిర్మాణానికి ముందుకొచ్చిన సంస్థతో ఒప్పందం చేసుకోవాలన్నారు. మంత్రి సత్యకుమార్ యాదవ్, వైద్యారోగ్యశాఖ ఉన్నతాధికారులు సమావేశంలో పాల్గొన్నారు.

## స్పీడ్ ఆఫ్ డెలివరింగ్ గవర్నెన్స్

### పౌరులకు మెరుగైన సేవలు అందించేలా కార్యాచరణ

### స్వర్ణాంధ్ర లక్ష్యాలను సాధనపై సిఎం చంద్రబాబు

స్పీడ్ ఆఫ్ డెలివరింగ్ గవర్నెన్స్ విధానంలో వేగంగా పౌరులకు మెరుగైన సేవలు అందించేలా కార్యాచరణ రూపొందించాలని చంద్రబాబు స్పష్టం చేశారు.



సుస్థిరాభివృద్ధితో పాటు స్వర్ణాంధ్ర లక్ష్యాలను సాధించేందుకు నిర్దేశించుకోవాల్సిన అంశాలపై అధికారులతో సీఎం చర్చించారు. స్వర్ణాంధ్ర లక్ష్యాలు, పది సూత్రాల అమలుపై ఏపీ సీఎం చంద్రబాబు సమీక్ష నిర్వహించారు. సచివాలయంలో నిర్వహించిన ఈ సమావేశానికి సీఎస్ విజయానంద్‌తో పాటు జలవనరులు, రెవెన్యూశాఖ ఉన్నతాధికారులు హాజరయ్యారు. ప్రభుత్వ శాఖల మధ్య మెరుగైన సమన్వయం, తక్కువ వ్యయంతో ఇంధనం, విద్యుత్, రవాణా, నీటి భద్రత అందించటమే లక్ష్యంగా ప్రణాళికలు రూపొందించాలని సూచించారు. జీరో పావర్టీ, మానవ వనరుల అభివృద్ధి, ఉద్యోగాల కల్పన, సాంకేతికత మేళవింపు తదితర అంశాల ఆధారంగా లక్ష్యాలపై అధికారులకు దిశానిర్దేశంచేశారు.

# కేసీఆర్‌కు మళ్లీ అధికారం కల్లే!

(మొదటి పేజి తరువాయి)

నారాయణపేట జిల్లా కోస్గిలో ఏర్పాటు చేసిన సర్పంచ్‌ల సన్మాన సభలో సీఎం మాట్లాడుతూ.. కేసీఆర్‌పై తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. ‘రెండేళ్ల తర్వాత కేసీఆర్ బయటకు వచ్చి తోలు తీస్తానంటున్నారు. కేసీఆర్‌వి సోయిలేని మాటలు.. స్థాయిలేని విమర్శలు. గతంలో నన్ను, నా కుటుంబాన్ని ఎన్నో రకాలుగా ఇబ్బందులు పెట్టారు. పగ సాధించడం మెదలుపెడితే రాష్ట్రానికి నష్టం జరుగుతుందని వదిలిపెట్టా. నేను ప్రమాణం చేసినప్పుడే కూలబడ్డారు.. ఇంతకంటే పెద్ద శిక్ష ఇంకేం ఉంటుంది. ఫాంహౌస్‌ను కేసీఆర్ బందీఖానాగా మార్చుకుని చుట్టూ పోలీసులున్నారు. చర్లపల్లికైనా, చంచల్‌గూడ జైలుకు పంపినా అదే పరిస్థితి ఉంటుంది కదా. నన్ను గెలకవద్దు.. మర్యాదగా ఉండదని మాట్లాడటం లేదు. నల్లమల నుంచి వచ్చి జడ్పీటీసీ, ఎమ్మెల్యే, ఎంపీ తర్వాత సీఎం అయ్యా అంటూ ఘాటైన విమర్శలు చేశారు. పాలమూరు రంగారెడ్డి, ఎస్ఎల్‌బిసి వంటి ప్రాజెక్టులను పండబెట్టిన ఘనుడవని విమర్శించారు. స్థిరాస్తి వ్యాపారం దందా చేస్తున్నానని కేసీఆర్ ఆరోపిస్తున్నారు. ఇదేం పాస్‌పోర్టు బ్రోకర్ వ్యవహారం కాదు. దుబాయ్ పంపుతామని ఎవరినీ మోసం చేయలేదు. రియల్ ఎస్టేట్ వ్యాపారంతో రాష్ట్రానికి ఆదాయం వస్తుంది. మరో వైపు.. హైదరాబాద్‌లో స్థిరాస్తి వ్యాపారం పడిపోయిందని కేటీఆర్ చెబుతున్నారు. కక్ష సాధింపు రాజకీయాలు చేయం.. ఎవరి పాపాన వారు పోతారని వదిలేశాం. మైకు ముందుకు రావట్లేదు.. దాక్కున్నానని కేటీఆర్ ఆరోపిస్తున్నారు. నువ్వెంత.. నీ స్థాయి ఎంత? తండ్రి పేరు చెప్పుకొని బతుకుతున్నావు. ఏపీలో చదువుకున్న కేటీఆర్‌కు తెలంగాణ గురించి ఏం తెలుసు? మా ఊరికొస్తావా? మీ ఊరికి రావాలా? ఎవరు భయపడుతున్నారో తెలుస్తుంది. గజ్వేల్‌లో లక్షలాది మంది కార్యకర్తలతో నిరసన చేపడితో పాతాళానికి వెళ్లారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో 119 సీట్లు అయితే.. 2/3 వంతు మెజార్టీతో 80కి పైగా సీట్లతో మళ్లీ మేమే అధికారంలోకి వస్తాం. ఒకవేళ 153 సీట్లయితే.. 100కి పైగా స్థానాల్లో విజయం సాధించి రెండో సారి ప్రజా ప్రభుత్వం ఏర్పాటు చేస్తాం. కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావు రాసి పెట్టుకోండి.. ఇదే నా సవాల్. నేను రాజకీయం చేసినంత కాలం కాలకూట విషం లాంటి కేసీఆర్ కుటుంబాన్ని అధికారంలోకి రానివ్వను.. ఇదే నా శపథం. కొడంగల్ బిడ్డగా ఈ గడ్డపై నుంచి శపథం చేస్తున్నా. నేను రాజకీయాల్లో ఉన్నంత కాలం... వచ్చే ఎన్నికల్లో కేసీఆర్ కుటుంబానికి అధికారమనేది కల. భారత రాష్ట్ర సమితి, కేసీఆర్ చరిత్ర ఖతమే. మీ పార్టీకి, మీకు భవిష్యత్తు లేదు. బీఆర్ఎస్, కేసీఆర్ గతమే.. తెలంగాణ భవిష్యత్తు కాంగ్రెస్. గత చరిత్రతో ఒరిగేదేమీ లేదని అన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో ఓడించాం. పార్లమెంట్ ఎన్నికల్లో గుండు సున్నా ఇచ్చాం. కంటోన్మెంట్‌లో బండకేసి కొట్టాం. జూబ్లీహిల్స్ ఎన్నికల్లో బోరబండలో బండ కింద పాతిపెట్టినం. 12,726 పంచాయతీల్లో 8,335 మంది సర్పంచ్‌లను గెలిపించుకున్నాం. ఇన్ని సార్లు ఓడించినా.. ఇంకా నాదే పైచేయి అంటారా? 2029 అసెంబ్లీ ఎన్నికల్లో తేల్చుకుందాం రండి. ఇప్పటికైనా కేసీఆర్ వయసును గౌరవిస్తాం. ఈనెల 29 నుంచి అసెంబ్లీ సమావేశాలు జరగబోతున్నాయి. మీరు చెప్పిన అన్ని అంశాలపై చర్చిద్దాం రండి. అసెంబ్లీలో చర్చించకుండా ఫాంహౌస్‌లో నిద్రపోయి.. ఖాళీగా ఉన్నప్పుడు పార్టీ ఆఫీసుకు వచ్చి ప్రెస్‌మీట్‌లు పెట్టడం కాదు. నిజమైన చర్చ అసెంబ్లీలో చేద్దాం.. ఎవరు ఏం మాట్లాడుతున్నారో ప్రజలు వింటారని కేసీఆర్ , ఆయన కుటుంబంపై నిప్పులు చెరిగారు. అత్యంత ఘాటైన పదజాలంతో విరుచుకుపడిన సీఎం, తనను , తన కుటుంబాన్ని గతంలో కేసీఆర్ వేధించారని, జైల్లో పెట్టి ఇబ్బందులకు గురిచేశారని గుర్తు చేసుకున్నారు. ఆయన చేసిన పాపాలే ఆయనను వెంటాడుతున్నాయి. జైల్లో పెట్టి ప్రభుత్వ ఖర్చుతో ఆయనకు తిండి పెట్టడం ఎందుకని నేను ఒక్క కేసు కూడా పెట్టకుండా వదిలేశాను. కానీ ఇప్పుడు సోయి లేకుండా మాట్లాడుతూ తోలు తీస్తా అని స్థాయి లేని మాటలు మాట్లాడుతున్నారని రేవంత్ రెడ్డి మండిపడ్డారు. కేసీఆర్ వ్యాఖ్యలకు ప్రతిసవాల్ విసురుతూ, ‘రా.. నీ చింతమడకకు రమ్మంటావా లేక కొడంగల్ వస్తావా? ఎక్కడైనా తేల్చుకుందాం. మటన్ కొట్టు మస్తాన్ దగ్గర పొట్టేలును కోసిన తర్వాత తోలు తీసే పని కేసీఆర్‌కు ఇమ్మని చెప్పాను. సాయంత్రం వెళ్లేటప్పుడు దావత్ కోసం ముక్కో బొక్కో ఇచ్చి పంపమని సూచించాను. నన్ను గెలికితే నేను మాట్లాడటం మొదలుపెడితే నువ్వు ఉరి వేసుకుని చస్తావు.

మల్లన్న సాగర్‌లో పడి చావాల్సిందే అని అన్నారు. ఆస్తిలో వాటా ఇవ్వాల్సి వస్తుందనే భయంతో సొంత బిడ్డను, అల్లుడిని వెళ్లగొట్టాడని, సొంత చెల్లెలిని పండుగకు కూడా ఇంటికి పిలవలేని వ్యక్తి తన గురించి మాట్లాడటం హాస్యాస్పదమని ఎద్దేవా చేశారు. ‘పిడకల మూతి బోడిలింగం లాంటి కేటీఆర్, నువ్వు, నీ జాతి అంతా వచ్చినా నేను భయపడను. మీ రాజకీయం ఏంటో చూపిస్తా, రాసి పెట్టుకో‘ అని సవాల్ విసిరారు.

సమావేశంలో పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి, మంత్రి వాకిటి శ్రీహరి , ఇతర ఎమ్మెల్యేలు పాల్గొన్నారు.

-------------

## హాస్టల్ విద్యార్థినులతో కలిసి భోజనం చేసిన ఉప ముఖ్యమంత్రి

**ఖమ్మంలో గిరిజన సంక్షేమ బాలికల డిగ్రీ కళాశాలను ఆకస్మికంగా సందర్శించిన మంత్రి**

**డిసెంబర్24(జర్నలిస్ట్ వార్త):** తెలంగాణ ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క ఖమ్మం జిల్లాలో విద్యార్థినులతో కలిసి భోజనం చేశారు. ఈ రోజు ఆయన జిల్లాలోని వైరా నియోజకవర్గం, కొనిజర్ల మండలంలో గల తెలంగాణ గిరిజన సంక్షేమ బాలికల గురుకుల డిగ్రీ కళాశాలను ఆకస్మికంగా సందర్శించారు. ఆయన వసతి సౌకర్యాలు, బోధన నాణ్యతను ప్రత్యక్షంగా పరిశీలించారు. అనంతరం విద్యార్థినులతో కలిసి భోజనం చేశారు. విద్య, వైద్యం, సంక్షేమ రంగాల అభివృద్ధి పట్ల కాంగ్రెస్ ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధతో ముందుకు సాగుతోందని మల్లు భట్టి విక్రమార్క పేర్కొన్నారు.




# పవన్ కల్యాణ్.. దాతృత్వం

### మూడేళ్ల హామీ నెరవేర్చిన డిప్యూటీ సీఎం





గుంటూరు, **డిసెంబర్24(జర్నలిస్ట్ వార్త):** : గ్రామస్థురాలు ఇండ్ల నాగేశ్వరమ్మకు ఇచ్చిన హామీ మేరకు డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ జిల్లాలోని ఇప్పటం గ్రామంలో బుధవారం పర్యటించారు. ఈ సందర్భంగా వృద్ధురాలు ఇండ్ల నాగేశ్వరమ్మ నివాసానికి వెళ్లి ఆమెను పరామర్శించారు. నీ బిడ్డగా నీ ఇంటికి వచ్చానంటూ నాగేశ్వరమ్మ కాళ్లకు పవన్ నమస్కరించారు. ఆపై వృద్ధురాలికి కొత్త బట్టలు ఇవ్వడంతో పాటు రూ. 50 వేల నగదు, వికలాంగుడైన ఆమె మనవడికి లక్ష రూపాయలను డిప్యూటీ సీఎం అందజేశారు. అంతే కాకుండా పవన్ కళ్యాణ్ తన ఎమ్మెల్యే జీతం నుంచి రూ. 5 వేలు ప్రతినెల పెన్షన్ రూపంలో వృద్ధురాలికి ఇస్తామని హామీ ఇచ్చారు. అలాగే అనారోగ్యంతో బాధపడుతున్న ఇండ్ల నాగేశ్వరమ్మ కుమారుడు కోసం రూ. 3 లక్షల సీఎంఆర్ఎఫ్ చెక్‌ను అందజేశారు. భవిష్యత్తులో అండగా ఉంటామని వృద్ధురాలికి హామీ ఇచ్చారు. ఎప్పుడు ఎలాంటి సహాయం కావాలన్నా పార్టీ ఆఫీస్‌కు రావాలని ఇండ్ల నాగేశ్వరమ్మకు పవన్ కళ్యాణ్ చెప్పారు. పవన్ రాకతో నాగేశ్వరమ్మ సంతోషం వ్యక్తం చేసింది. గత వైసీపీ హయాంలో రోడ్డు విస్తరణ పేరుతో ఇప్పటంలో జనసేన కార్యకర్తల ఇళ్లను కూల్చివేసిన విషయం తెలిసిందే. జనసేన ఆవిర్భావ సభకు భూములు ఇచ్చారనే కక్షతోనే ఇళ్లను కూల్చేశారనే ఆరోపణలు ఉన్నాయి. విషయం తెలిసిన వెంటనే అప్పట్లో గ్రామంలో పర్యటించిన పవన్.. బాధితులకు అండగా నిలిచారు. ఈ క్రమంలో వృద్ధురాలు ఇండ్ల నాగేశ్వరమ్మ కూడా పవన్‌ను కలిశారు. ఎన్నికల్లో గెలిచాక తమ గ్రామానికి రావాలని పవన్‌ను వృద్ధురాలు కోరారు. ఆమెకు ఇచ్చిన మాట ప్రకారం బుధవారం పవన్ ఇప్పటం గ్రామంలో పర్యటించి వృద్ధురాలిని పరామర్శించడంతో పాటు ఆమెకు ఆర్థిక సాయాన్ని అందజేసి మానవత్వాన్ని చాటుకున్నారు

## మృతుల కుటుంబాలను పరామర్శించిన సర్పంచ్ సుజనా శ్రీనివాస్



**స్టేషన్ ఘన్ పూర్/డిసెంబర్ 24(జర్నలిస్ట్ వార్త) :** మండలంలోని తాటికొండ గ్రామంలో ఎడమ గట్టమ్మ, బండ ఆగమల్లు మృతి చెందడం జరిగింది. విషయం తెలుసుకున్న గ్రామ సర్పంచ్ మారపాక సుజనా శ్రీనివాస్, ఉప సర్పంచ్ ఎడమ కట్టమల్లు బుధవారం పార్ధిహదేహాలకు పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం మృతుల కుటుంబ సభ్యులను పరామర్శిం చారు. కుటుంబాలకు మనో ధైర్యాన్ని అందియడం జరిగింది. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు, గ్రామ కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థి ప్రాణం తీసిన పెన్సిల్...!



**ఖమ్మం బ్యూరో/డిసెంబర్24(జర్నలిస్ట్ వార్త):** ఆ చిన్నారి బాబు రోజులానే పెన్సిల్ జేబులో పెట్టుకున్నాడు. కానీ అదే పెన్సిల్ తన ప్రాణాలను తీస్తుందని ఊహించలేకపోయాడు. ఖమ్మం పరిధి లోని కూసుమంచి మండలం నాయకన్ గూడెం లో ఓ ప్రైవేట్ పాఠశాలలో యుకేజీ చదువుతున్న మేడరపు విహార్ (6) రోజులానే మధ్యాహ్నం స్నేహితులతో కలిసి ఆడుకుంటూ ప్రమాదవశాత్తూ కిందపడి పోయాడు. అయితే దురదృష్టవశాత్తు తన జేబులోని పెన్సిల్ బలంగా తన ఛాతీ లోకి గుచ్చుకోవడం తో ఆ చిన్నారి భాదతో విలవిలలాడుతూ చనిపోయాడు.

## ప్రజలకు క్రిస్మస్ శుభాకాంక్షలు..

### ఎస్సై వెంకటకృష్ణ




**తల్లాడ/డిసెంబర్24(జర్నలిస్ట్ వార్త):** మండలం పరిధిలో ప్రజలకు, క్రైస్తవ సోదరలకు తల్లాడ ఎస్ఐ వెంకటకృష్ణ, క్రిస్మస్ పర్వదిన శుభాకాంక్షలు తెలిపారు. ప్రేమా భావాన్ని, సేవాతత్పరతను, క్షమా గుణాన్నీ బోధించిన క్రీస్తు జన్మదినం క్రైస్తవులకు అత్యంత సంతోషకరమైన రోజు అని పేర్కొన్నారు. పర్వదినం క్రిస్టియన్ సోదరుల అందరికి శుభం చేకూరాలని, కుటుంబ సమేతంగా సుఖసంతోషాలతో క్రిస్మస్ వేడుక జరుపుకోవాలని ,ఆకాంక్షించారు. యేసు క్రీస్తు దీవెనలు ప్రతి ఒక్కరికీ లభించాలని, అందరూ సంతోషంగా జీవించాలని ప్రార్థించారు.

## క్రిస్టియన్ సోదర, సోదరి మణులకు క్రిస్టమస్ శుభాకాంక్షలు తెలిపిన రాష్ట్ర మంత్రి తుమ్మల



**ఖమ్మం బ్యూరో/డిసెంబర్ 24 (జర్నలిస్ట్ వార్త):** క్రిస్టియన్ లకు రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు శుభాకాంక్షలు తెలిపారు. ప్రేమ, దయ, శాంతి మార్గాలను చూపించిన క్రీస్తు బోధనలు విశ్వ మానవాళికి సదా ఆచరణీయమని మంత్రి తుమ్మలతన శుభాకాంక్షలు తెలిపారు. ఏసుక్రీస్తు పుట్టిన రోజు సందర్భంగా క్రైస్తవ ప్రజానీకం సంతోషం గా జీవించాలని కోరుకొన్నారు.

## మృతుల కుటుంబాలను పరామర్శించిన అక్కేనపల్లి బాలరాజు



**స్టేషన్ ఘన్ పూర్/డిసెంబర్ 24(జర్నలిస్ట్ వార్త):** మండలంలోని తాటికొండ గ్రామంలో ఎడమ గట్టమ్మ, బండ ఆగమల్లు మృతి చెందడం జరిగింది. విషయం తెలుసుకున్న బీఆర్ఎస్ జిల్లా నాయకుడు పార్ధిహదేహలను పూలమాలవేసి నివాళులర్పించిన స్టేషన్ ఘనపూర్ మాజీ మార్కెట్ చైర్మన్ అక్కేనపల్లి బాలరాజు బుధవారం గ్రామానికి చేరుకుని ఎడమ గట్టమ్మ,బండ ఆగమల్లు పార్ధివాదేహాలకు పూలమాల వేసి నివాళులర్పించరు. అనంతరం మృతుల కుటుం బ సభ్యులను పరామర్శించారు. కుటుంబాలకు మనో ధైర్యాన్ని అందియడం జరిగింది. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు పొన్నం శ్రీవాస్ గౌడ్,తాటికొండ కాంటెస్టెడ్ సర్పంచ్ అభ్యర్థి మరపాక కవిత-మనోహర్, వార్డెమెంబెర్ పెరబోయిన కుమార్ యాదవ్ , నాయకులు మేకల మల్లేష్ యాదవ్,దాసరి యాదగిరి యాదవ్, అక్కెనపల్లి వెంకటయ్య, ముక్క ముల రాజు యాదవ్, పులిగిల్ల రాజు యాదవ్, మర పాక నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

## బిజెపిలో చేరిన రంగయ్యపల్లి సర్పంచ్ రజని

### పార్టీ కండువా కప్పి ఆహ్వానించిన బండి సంజయ్




**భీమదేవరపల్లి/డిసెంబర్24 (జర్నలిస్ట్ వార్త):** హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం భారతీయ జనతా పార్టీ మండల అధ్యక్షులు శ్రీరామోజు శ్రీనివాస్ ఆధ్వర్యంలో బుధవారం కరీంనగర్ లో కేంద్ర మంత్రివర్యులు పార్లమెంటు సభ్యులు బండి సంజయ్ ని కలిసారు. ఈ సందర్భంగా రంగయ్య పల్లి గ్రామం నుంచి సర్పంచ్ మండల రజని మహేష్, వార్డ్ సభ్యులు, గ్రామస్తులు పెద్ద ఎత్తున భారతీయ జనతా పార్టీలో చేరారు. రంగయ్య పల్లె గ్రామానికి అత్యధిక నిధులు సమకూరుస్తానని ఈ సందర్భంగా బండి సంజయ్ మాట ఇవ్వడం జరిగిందని తెలిపారు. రాబోయే రోజులలో భీమదేవరపల్లి మండలంలో కాషాయ జెండా ఎగరవేయడమే ఏకైక లక్ష్యంగా బండి సంజయ్ నిర్ణయాల ప్రకారం మండల నాయకత్వం ముందుకు వెళ్తామన్నారు. టిఆర్ఎస్, కాంగ్రెస్ ప్రభుత్వం కంటే నిధులు ఎక్కువ తెచ్చి గ్రామాలను అభివృద్ధి చేస్తామన్నారు. రానున్న ఎంపీటీసీ, జడ్పిటిసి ఎన్నికల్లో అత్యధిక స్థానాలను కైవసం చేసుకుంటామని ధీమా వ్యక్తం చేశారు. సభ్యులు చేవెళ్ల ఆగయ్య, పెండ్యాల మొగిలి, బైకని కో%శీ%రయ్య, జిమ్మల మల్లారెడ్డి, మండల కనకయ్య, బిల్లవేన రవి, ఏనుగుల మల్లయ్య, కస్పోజు బిక్షపతి బైకని సురేష్ బీజేపీలో చేరారు. ఈ కార్యక్రమంలో జిల్లా కౌన్సిల్ మెంబర్ పైడిపల్లి పృథ్వీరాజ్, సీనియర్ నాయకులు దొంగల కొమురయ్య, మ్యకల రాజు, సింగం రాజేందర్, జిమ్మల శ్రీనాథ్, సంజయ్, అజయ్ తదితరులు పాల్గొన్నారు.

## బస్టాండ్ లో ప్రయాణికుల సౌకర్యం కోసం మరుగుదొడ్లు నిర్మింప చేస్తాం

### గ్రామ సర్పంచ్ గారే సయేంద్రబిక్షపతి



**రాయపర్తి/డిసెంబర్ 24(జర్నలిస్ట్ వార్త):** రాయపర్తి మండల కేంద్రంలోని బస్టాండ్ లో మరుగుదొడ్లు లేక ప్రయాణికుల ఇబ్బందులు పడుతున్నారని గుర్తించిన రాయపర్తి సర్పంచ్ గారే సయేంద్రబిక్షపతి బుధవారం బస్టాండును సందర్శించి త్వరలో బస్టాండ్ ప్రయాణికుల సౌకర్యం కోసం మరుగుదొడ్ల నిర్మింపచేస్తామని అన్నారు. అనంతరం కొత్త రాయపర్తి కాలనీ లో శివాలయం వద్ద బోర్ బావి పనిచేయడం లేదని గ్రామస్తుల సూచన మేరకు దానిని పూర్తిస్థాయిలో రిపేర్ చేయించి ప్రజలకు అందుబాటులోకి తీసుకొని వస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో బిల్ కలెక్టర్ రామచంద్రయ్య,యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షులు కోతి కళ్యాణ్ తదితరులు పాల్గొన్నారు

## గొర్రెలకు,మేకలకు నట్టల నివారణ మందులు వేయించాలి



**రాయపర్తి/డిసెంబర్ 24(జర్నలిస్ట్ వార్త):** గొర్రెలకు, మేకలకు నట్టల నివారణ మందులు వేయించాలని సర్పంచులు రాయిని యాకయ్య, కొండం రంగా రెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని కొండూరు, కిష్టాపురం గ్రామాలలో గొర్రెలకు మరియు మేకలకు ఉచిత నట్టల నివారణ మందుల కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మండల పదువైద్యాధికారిని డాక్టర్ శృతి,కిష్టాపురం ఉప సర్పంచ్ సోమనర్సయ్య, ఎం వెంకటయ్య,టి గణేష్ తదితరులు పాల్గొన్నారు.

## సర్పంచ్ తిరుపతమ్మను సన్మానించిన వికలాంగుల ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు ఎండి అజీమ్



**స్టేషన్ ఘన్ పూర్/డిసెంబర్ 24(జర్నలిస్ట్ వార్త) :** నవ తెలంగాణ రాష్ట్ర వికలాంగుల ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు ఎండీ అజీమ్ ఆధ్వర్యంలో బుధవారం రోజున జనగాం జిల్లా చిల్పూర్ మండలంలోని చిన్న పెండ్యాల గ్రామంలో మొన్న జరిగిన సర్పంచ్ ఎన్నికల లో విజయం సాధించిన దివ్యాంగురాలైన ఇల్లందుల తిరుపతమ్మ ని గ్రామపంచాయతీ కార్యాలయంలో నవ తెలంగాణ రాష్ట్ర వికలాంగుల ఫోరం తరపున శు భాకాంక్షలు తెలుపుతూ ఘనంగా సన్మానించడం జరిగింది. అనంతరం రాష్ట్ర అధ్యక్షుడు ఎండీ అజీమ్ మాట్లాడుతూ దివ్యాంగురాలైన తిరుపతమ్మ సర్పంచ్ గా గెలవడం దివ్యాంగ సమాజానికి చాలా సంతోషకర మన్నారు. వీరిని ఆదర్శంగా తీసుకొని రాబోయే అన్ని ఎలక్షన్లలో కూడా దివ్యాంగులు ముందుకు రావాలని కోరారు. సమాజంలో దివ్యాంగులకు రాజకీయ అవకా శాలు కల్పిస్తే సకలంగుల కంటే ఎక్కువ ప్రజలకు సేవ చేస్తారని తెలుపుతూ దివ్యాంగుల ఓటు బ్యాంకును పరిగణలోకితీసుకొని కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు దివ్యాం గులకు రాజకీయ రిజర్వేషన్ కల్పించాలని,అంతేకాదు రాబోయే కార్పొరేషన్ ఎన్నికలలో కూడా దివ్యాంగుల కు ప్రాధాన్యత ఇవ్వాలని అదేవిధంగా నామినేటెడ్ పోస్టులలోకూడా దివ్యాంగులకు అవకాశాలుకల్పించా లని ఈ సందర్భంగా కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర సహాయక కార్యదర్శి బండారి మహేందర్, ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షులు బండి చక్రపాణి, వరంగల్ జిల్లా అధ్యక్షుడు సతీష్, జనగాం జిల్లా అధ్యక్షుడు పంతులు ప్రభాకర్, జిల్లా కోశాధికారి దికొండ సాయిరా మ్,జిల్లా సహాయ కార్యదర్శి పోరండ్ల సంపత్, నూతన సర్పంచ్ సోదరుడు ఇల్లందుల సుదర్శన్ పాల్గొన్నారు.

## కొత్తకొండ జాతర బ్రహ్మోత్సవాలు విజయవంతం చేయాలి

### అధికారులు సమన్వయంతో పనిచేయాలి: మంత్రి పొన్నం

### జాతర పోస్టర్ ఆవిష్కరించిన మంత్రి పొన్నం ప్రభాకర్



**భీమదేవరపల్లి/డిసెంబర్24 (జర్నలిస్ట్ వార్త):** హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం కొత్తకొండ శ్రీ వీరభద్రస్వామి బ్రహ్మోత్సవాల పోస్టర్ ను మంత్రి పొన్నం ప్రభాకర్ బుధవారం ఆవిష్కరించారు. హుస్నాబాద్ మంత్రి క్యాంపు కార్యాలయంలో ఈవో కిషన్ రావు, ఆలయ అర్చకులు, కొత్తకొండ గ్రామ సర్పంచ్ సిద్దమల్ల రమా రమేష్, ఉప సర్పంచ్ యాదగిరి , వార్డు సభ్యులు, ఇతర ముఖ్య నేతలు మంత్రిని కలిసారు. జనవరి 9 నుండి 18 వ తేదీ వరకు కొత్తకొండ శ్రీ వీరభద్రస్వామి జాతర బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగనున్నారు. కాకతీయుల కాలంలో నిర్మించబడిన కొత్తకొండ శ్రీ వీరభద్ర స్వామి ఆలయంలో జనవరి 9 నుంచి బ్రహ్మోత్సవాలు మొదలుకానున్నాయి. 10న శ్రీ వీరభద్రస్వామి వారి కళ్యాణం, 13న భోగి పండగ, 14న మకర సంక్రాంతి సందర్భంగా బండ్లు తిరుగుట, 18న అగ్నిగుండాలు కార్యక్రమాలు నిర్వహిస్తారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం మాట్లాడుతూ.. కోర మీసాల వీరభద్రస్వామి కొంగు బంగారంగా ఈ ప్రాంత ప్రజల ఆరాధ్య దైవంగా వెలసిలుతున్నట్లు తెలిపారు. జాతరకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ప్రజాప్రతినిధులు, అధికారులు అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు చెప్పారు.

## సెయింట్ మేరీ పాఠశాలలో ముందస్తు క్రిస్మస్ వేడుకలు



**రాయపర్తి/డిసెంబర్ 24(జర్నలిస్ట్ వార్త):** మండలంలోని కాట్రపల్లి గ్రామంలోని సెయింట్ మేరీ హై స్కూల్ లో ముందస్తుగా క్రిస్మస్ సంబరాలు,ఫుడ్ ఫెస్టివల్ జరుపుకున్నారు. ఈ వేడుకలో పిల్లలు మేరీమాత క్రిస్మస్ తాత పలు వేషధారణలో అందరినీ ఆకట్టుకున్నారు. ఫుడ్ ఫెస్టివల్ లో భాగంగా విద్యార్థులు రకరకాల ఆహార పదార్థాలు తయారుచేసి రకరకాల స్టాల్ లు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సోమన్న పిల్లలకు వారి తల్లిదండ్రులకు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో భాగంగా పాఠశాల కరెస్పాండెంట్ శిబుపాల్, డైరెక్టర్స్ వెంకటరెడ్డి,రావీణ రాజ్,సుధాకర్, రమేష్, అకాడమిక కోఆర్డినేటర్ ప్రవీణ్, ఉపాధ్యాయులు హరిబాబు, ప్రసాద్,రమేష్ మోతిలాల్, అనిల్,సుజాత,సరిత,అశ్విత, సరస్వతి, రిజ్వాన, స్వాతి రవళి,తదితరులు పాల్గొన్నారు.

# ఎమ్మెల్యే కడియం శ్రీహరిని విమర్శిస్తే ఊరుకోం

## -కాంగ్రెస్ పార్టీ లీగల్ సేల్ రాష్ట్ర అధ్యక్షుడు కనకం రమేష్





**స్టేషన్ ఘన్ పూర్/డిసెంబర్ 24(జర్నలిస్ట్ వార్త):** నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తున్న మాజీ ఉప ముఖ్యమంత్రి, ఎమ్మెల్యే కడియం శ్రీహరిని విమర్శిస్తే చూస్తు ఊరుకోమని కాంగ్రెస్ పార్టీ లీగల్ సేల్ రాష్ట్ర అధ్యక్షుడు కనకం రమేష్ అన్నారు. డివిజన్ కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశం కాంగ్రెస్ పార్టీ లీగల్ సేల్ రాష్ట్ర అధ్యక్షుడు కనకం రమేష్ మాట్లాడుతూ మాజీ ఎమ్మెల్యే రాజయ్యను నియోజకవర్గ ప్రజలు ఛీకొట్టిన నాలుగైదు రోజులుగా పదిమంది దళితులను వెంట బెట్టుకొని నియోజకవర్గాన్ని అన్ని విదాల అభివృద్ధి చేస్తున్న ఎమ్మెల్యే కడియం శ్రీహరిపై అనుచిత వ్యాఖ్య లు చేస్తూ కడియం దిష్టిమ్మలు దగ్ధం చేయించడం తీవ్రంగా ఖండిస్తున్నాం అన్నారు. దళిత బంధు పేరు తో డబ్బులు వసూలు చేసిన రాజయ్య 14 సంవత్స రాలుగా ఎమ్మెల్యేగా ఉండి నియోజకవర్గానికి ఎలాంటి అభివృద్ధి చేయకపోగా కడియం చేస్తున్న అభివృద్ధిని అడ్డుకుంటున్నారని అన్నారు. నియోజకవర్గంలో జరు గుతున్న అభివృద్ధిని చూస్తే కడియం మార్క్ ప్రతిఒక్క రికి కనబడుతుందన్నారు. నియోజకవర్గ అభివృద్ధి కోసమే ఎమ్మెల్యే కడియం శ్రీహరి కాంగ్రెస్ ప్రభుత్వంతో కలిసి పనిచేస్తున్నారని అన్నారు. ఏ పదవి కావాలన్నా డబ్బులు తీసుకొని పదవులు ఇచ్చిన రాజయ్య అభివృద్ధి లక్ష్యంగా పనిచేస్తున్న కడియం ను విమర్శిస్తే చూస్తూ ఊరుకోమని,గ్రామాలకువస్తే తరిమికొడతామని అన్నారు.ఈ సమావేశంలో దేశాయ్ తండా సర్పంచ్ భూక్య వెంకటేశ్వర్లు, నాయకులు జోసఫ్, సింగపురం వెంకటయ్య, భూక్య స్వామినాయక్, బాస్కులు ఎల్లయ్య, కుందూరు వెంకటరెడ్డి, చేపూరు మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

# బిఆర్ఎస్ పార్టీ సర్పంచ్,ఉపసర్పంచ్ లను సన్మానించిన మాజీ ఎమ్మెల్యే. హరిప్రియ నాయక్.



**బయ్యారం/డిసెంబర్24(జర్నలిస్ట్ వార్త):** బయ్యారం మండలంలో డిసెంబర్ 14 న జరిగిన పంచాయతీ ఎన్నికలలో బిఆర్ఎస్ పార్టీ బలపరిచిన సర్పంచ్ అభ్యర్థులు గెలుపొందిన సందర్భంగా వారిని విబిటి ఫంక్షన్ హాల్ లో పార్టీ మండల అధ్యక్షులు తాత గణేష్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో సర్పంచులను,ఉపసర్పంచులను ఇల్లందు నియోజకవర్గ మాజీ శాసనసభ్యులు హరిప్రియ నాయక్ వారిని ఘనంగా సన్మానించి సత్కరించారు.ఈ సమావేశంలో హరిప్రియ మాట్లాడుతూ రాబోయే ఎంపీటీసీ,జడ్పిటిసి ఎన్నికలలో ఎంపీపీ,జడ్పీటీసీని కైవసం చేసుకోవాలని పార్టీ నాయకులను కోరారు.29 పంచాయతీ పరిధిలో 8 పంచాయతీలలో బిఆర్ఎస్ సర్పంచులను గ్రామ ప్రజలు ఎన్నుకున్నారని తెలిపారు.ఈ కార్యక్రమంలో గంగుల సత్యనారాయణ,ఆంగోత్ శ్రీకాంత్ నాయక్,ఏనుగుల ఐలయ్య,బానోతు శ్రీను నాయక్,మండల ఉపాధ్యక్షులు బానోతు మురళి కృష్ణ,బానోతు లక్ష్మణ్ నాయక్,జెర్పుల శ్రీను నాయక్, మండల ప్రచార కార్యదర్శి రేపాకుల వెంకన్న,ఇస్లావత్ వీరన్న,పొడుగు సుగుణ,రేఖ యాకన్న,తొట్టి అనిల్, అజ్మీర కల్పన సునీల్ నాయక్,బైగల వీరబాబు,కొండల్ నాయక్,శోభన్, శ్రీకాంత్,ఉదయ్,బట్టు మధుకర్,అల్లం వెంకన్న, తాటి వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

# బాధిత కుటుంబాన్ని పరామర్శించిన కాంగ్రెస్ నాయకులు



**రాయపర్తి/డిసెంబర్ 24(జర్నలిస్ట్ వార్త):**మండలంలోని కొండాపురం గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కేశబోయిన దూడయ్య ఇటీవల అనారోగ్యంతో మరణించగా బుధవారం వారి దశదినకర్మ లో పాల్గొని మృతుని చిత్ర పటానికి కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఈదులకంటి రవీందర్ రెడ్డి,తొర్రూర్ బ్లాక్ అధ్యక్షుడు జాటోత్ హామ్య నాయక్,మాజీ టీపీసీసీ కార్యదర్శి బిల్లా సుధీర్ రెడ్డి నివాళులు అర్పించి బాధిత కుటుంబాన్ని పరామర్శించారు.ఈ కార్యక్రమంలో గ్రామ పార్టీ అధ్యక్షుడు ఎర్రబెల్లి నరేందర్ రావు,మాజీ సర్పంచ్ ఎనగందుల మురళి,గ్రామ వర్కింగ్ ప్రెసిడెంట్ ఎండి ఖదీర్, బూత్ కన్వీనర్ కన్నబోయిన కుమారస్వామి,కనుకుంట్ల లక్ష్మీనారాయణ, కనుకు%శీ%ట్ల అశోక్, పిన్నింటి సోమయ్య,గాదె రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# సెమీ క్రిస్మస్ వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే కోరం కనకయ్య.







**బయ్యారం/డిసెంబర్ 24(జర్నలిస్ట్ వార్త):** బయ్యారం మండల కేంద్రంలో క్రీస్తు ప్రార్ధన మందిరంలో నిర్వహించిన సెమీ క్రిస్మస్ వేడుకలలో ఇల్లందు ఎమ్మెల్యే కోరం కనకయ్య పాల్గొన్నారు.ఈ సందర్భంగా చర్చ్ లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి ప్రభువు ఆశీర్వాదలు తీసుకున్నారు.. అనంతరం కేక్ కట్ చేసి క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్బంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ క్రిస్మస్ పండుగ శాంతి, ప్రేమ, కరుణ, త్యాగం వంటి మానవీయ విలువలకు ప్రతీక అని తెలిపారు.ఏసుక్రీస్తు బోధనలు సర్వ మానవాళికి ఆదర్శప్రాయమని, వాటిని ప్రతి ఒక్కరూ ఆచరించాలని సూచించారు. పరస్పర సహకారం, సహనం, సోదరభావంతో జీవించడమే క్రిస్మస్ పండుగ సందేశమని తెలిపారు. ఈ పండుగను క్రైస్తవులు కుటుంబ సభ్యులతో కలిసి ఆనందంగా, ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని ఆకాంక్షించారు. సమాజంలో అన్ని వర్గాల ప్రజలు ఐక్యతతో కలిసి ముందుకు సాగాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో తహాశీల్దార్ నాగరాజు,మూల మధుకర్ రెడ్డి,తిరుమల ప్రభాకర్ రెడ్డి,విరబోయిన సంపత్ యాదవ్,వెంకటపతి,ఆర్ఐ లు సందీప్, ఉపేందర్,పగడాల శ్రీనివాస్,కత్తి రమేష్, వల్లల వెంకన్న,వజ్జ సమత, గణేష్,స్థానిక ప్రజా ప్రతినిధులు, నాయకులు, క్రైస్తవ మత పెద్దలు, క్రైస్తవులు తదితరులు పాల్గొన్నారు.

# 23.02 ఎకరాల ఖమ్మం జర్నలిస్టుల ఇళ్ల స్థలాన్ని తక్షణమే అప్పగించాల్సిందే

## ఎంపీజే తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు అబ్దుల్ మజీద్ షోయబ్ డిమాండ్



**ఖమ్మం బ్యూరో/డిసెంబర్24 (జర్నలిస్ట్ వార్త):** జర్నలిస్టుల సంక్షేమమే లక్ష్యంగా గత ప్రభుత్వం జారీ చేసిన జీవో ప్రకారం అర్హులైన ఖమ్మం జర్నలిస్టులకు కేటాయించిన 23.02 ఎకరాల (రెండు కుంటలు) భూమిని ఎలాంటి నిర్లక్ష్యం, కాలయాపన లేకుండా తక్షణమే జర్నలిస్టులకు అప్పగించాలని మూమెంట్ ఫర్ పీస్ అండ్ జస్టిస్ (ఎంపీజే) తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు అబ్దుల్ మజీద్ షోయబ్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.ఎంపీజే జిల్లా పర్యటనలో భాగంగా ఖమ్మం నగరానికి విచ్చేసిన అబ్దుల్ మజీద్ షోయబ్‌ను, తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (టిడబ్ల్యూజేఎఫ్ – హెచ్ –2843) జిల్లా అధ్యక్షులు టి. సంతోష్ చక్రవర్తి నేతృత్వంలో జర్నలిస్టు నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఖమ్మం జర్నలిస్టులు ఎదుర్కొంటున్న ఇళ్ల స్థలాల సమస్యను వినతి పత్రం ద్వారా ఆయన దృష్టికి తీసుకువెళ్లారు. ఈ అంశంపై స్పందించిన అబ్దుల్ మజీద్ షోయబ్ మాట్లాడుతూ, స్టేట్ పాలసీ పేరుతోనూ, సుప్రీంకోర్టు తీర్పును సాకుగా చూపుతూ కావాలనే కాలయాపన చేయడం దురదృష్టకరమని వ్యాఖ్యానించారు. అర్హులైన జర్నలిస్టులకు న్యాయంగా రావాల్సిన ఇళ్ల స్థలాల అప్పగింత జరిగే వరకు ఎంపీజే జర్నలిస్టుల పోరాటానికి పరోక్ష ఉద్యమ రూపంలో సంపూర్ణ మద్దతు అందిస్తుందని స్పష్టం చేశారు.అనంతరం టిడబ్ల్యూజేఎఫ్ (హెచ్– 2843) జిల్లా అధ్యక్షులు టి. సంతోష్ చక్రవర్తి మాట్లాడుతూ,సుప్రీంకోర్టు తీర్పును సాకుగా చూపుతూ సంవత్సరాల తరబడి ఇళ్ల స్థలాలను జాప్యం చేయడం శోచనీయమని తీవ్రంగా విమర్శించారు. ఇళ్ల స్థలాల విషయంలో జరుగుతున్న నిర్లక్ష్యం కారణంగా జర్నలిస్టులు, వారి కుటుంబాలు తీవ్ర మానసిక, ఆర్థిక వేదనకు గురవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ అన్యాయానికి వ్యతిరేకంగా రాష్ట్రవ్యాప్తంగా టిడబ్ల్యూజేఎఫ్ ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. దీనిపై స్పందించిన ఎంపీజే రాష్ట్ర అధ్యక్షులు అబ్దుల్ మజీద్ షోయబ్, జర్నలిస్టుల డిమాండ్ పూర్తిగా న్యాయమైనదని, ఇళ్ల స్థలాల మంజూరుకు ఎంపీజే సంపూర్ణ మద్దతు కొనసాగుతుందని మరోసారి భరోసా ఇచ్చారు.ఈ కార్యక్రమంలో టిడబ్ల్యూజేఎఫ్ జిల్లా కోశాధికారి అరవపల్లి నగేష్, నాయకులు కప్పల మధు, ఎంపీజే రాష్ట్ర ఉపాధ్యక్షులు షేక్ ఖాసిమ్, జిల్లా కార్యదర్శి రజబాలి తదితరులు పాల్గొన్నారు.

# ప్రజలకు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపిన తల్లాడ కాంగ్రెస్ పార్టీ నాయకులు , సుధాకర్, కిషోర్



**తల్లాడ/డిసెంబర్24(జర్నలిస్ట్ వార్త):** మండలం పరిధిలో ప్రజలకు, క్రైస్తవ సోదర, సోదరీమణులకు కాంగ్రెస్ పార్టీ నాయకులు వైరామార్కెట్ వైస్ చైర్మన్ కాపు సుధాకర్, క్రిస్మస్ పర్వదిన శుభాకాంక్షలు తెలిపారు. ప్రేమా భావాన్ని, సేవాతత్పరతను, క్షమా గుణాన్నీ బోధించిన క్రీస్తు జన్మదినం క్రైస్తవులకు అత్యంత సంతోషకరమైన రోజు అని పేర్కొన్నారు. పర్వదినం క్రిస్టియన్ సోదరుల అందరికి శుభం చేకూరాలని, కుటుంబ సమేతంగా సుఖసంతోషాలతో క్రిస్మస్ వేడుక జరుపుకోవాలని జక్కంపూడి కిషోర్,ఆకాంక్షించారు. యేసు క్రీస్తు దీవెనలు ప్రతి ఒక్కరికీ లభించాలని, అందరూ సంతోషంగా జీవించాలని ప్రార్థించారు.

# త్రివేణి పాఠశాలలో ఘనంగా క్రిస్మస్ వేడుకలు...



**సత్తుపల్లి/డిసెంబర్24(జర్నలిస్ట్ వార్త):** త్రివేణి పాఠశాల ప్రాంగణంలో నేడు క్రిస్మస్ పండుగను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన ఉత్సాహభరిత నృత్య కార్యక్రమాలు, మధురమైన క్రిస్మస్ గీతాలు, క్రిస్మస్ పండుగ ప్రాముఖ్యతను తెలియజేసే నాటికలు అందరినీ అలరించాయి.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన పాస్టర్ ప్రేమ, శాంతి, సేవా భావం వంటి క్రిస్మస్ సందేశాలను విద్యార్థులకు తెలియజేస్తూ హృదయాన్ని తాకే ప్రసంగం చేశారు. విద్యార్థులు నైతిక విలువలు పాటిస్తూ ఉత్తమ పౌరులుగా ఎదగాలని ఆకాంక్షించారు.పాఠశాల ప్రిన్సిపాల్ ఎం. సరిత మాట్లాడుతూ క్రిస్మస్ పండుగ మానవత్వం, సోదరభావం, సహనాన్ని పెంపొందిస్తుందని పేర్కొన్నారు. విద్యతో పాటు మంచి గుణాలను కూడా విద్యార్థులు అలవరుచుకోవాలని ఆమె సూచించారు.అనంతరం క్యాంపస్ ఇన్‌చార్జ్ వంశీ, అకడమిక్ ఇన్‌చార్జ్ పవన్, కిడ్స్ ఇన్‌చార్జ్ శ్రీపద్మ విద్యార్థులకు శుభాకాంక్షలు తెలియజేస్తూ ఆనందభరిత సందేశాలు అందించారు.

# సృష్టి తరహాలో మరో మోసం బట్టబయలు

## పిల్లలను విక్రయిస్తున్న ముఠా గుట్టురట్టు -12మంది ముఠా సభ్యుల అరెస్ట్



హైదరాబాద్, **డిసెంబర్24(జర్నలిస్ట్ వార్త):**:తాజాగా భాగ్యనగరంలో మరో సృష్టి కేసు వెలుగులోకి వచ్చింది. పసి పిల్లలను అమ్ముతున్న ముఠాను పోలీసులు పట్టుకున్నారు. పిల్లల విక్రయానికి లక్షల్లో లావాదేవీలు జరిగినట్లు పోలీసులు గుర్తించారు. గతంలో సరోగసి పేరుతో దంపతుల నుంచి లక్షల్లో వసూలు చేసి, పిల్లలను అక్రమంగా విక్రయించిన సృష్టి కేసు రాష్ట్రంలో ఎంతటి సంచలనాన్ని సృష్టించిందో అందరికీ తెలిసిందే. ఇప్పుడు అదే తరహాలో పసిపిల్లలను తెచ్చి అంటగట్టడం ద్వారా లక్షల్లో దోచుకున్న ముఠా గుట్టురట్టయ్యింది. దాదాపు 12 మంది ముఠా సభ్యులను అరెస్ట్ చేసిన పోలీసులు.. వారి బారి నుంచి పిల్లలను రక్షించారు. వివరాల్లోకి వెళితే.. దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి పిల్లలను తెచ్చి అమ్ముతున్న ముఠా గుట్టను పోలీసులు రట్టు చేశారు. హైదరాబాద్‌లో దాదాపు 15 మంది పిల్లలను అమ్మిన ముఠాను సైబరాబాద్ ఎస్వోటీ పోలీసులు పట్టుకున్నారు. పక్కా ప్రణాళికతో శిశువులను విక్రయిస్తున్న 12 మందిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వీరంతా నగరంలోని ఎనిమిది ఆస్పత్రులకు ఏజెంట్లగా పని చేస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. ఈ ముఠా నుంచి ఇద్దరు బాలలను ఎస్వోటీ పోలీసులు కాపాడారు. అంతే కాకుండా ఒక్కొక్క శిశువు అమ్మకం వెనకాల 15 లక్షల రూపాయల లావాదేవీలు జరిగినట్లు పోలీసుల విచారణలో బయటపడింది.

జర్నలిస్ట్ వార్త
TELTEL/2023/87607
అనుక్షణం ప్రజల పక్షం... తెలుగు దిన పత్రిక
గురువారం 25 డిసెంబర్ 2025

# క్షమా గుణాన్నీ బోధించిన దేవుడు క్రీస్తు మాత్రమే

**టిసిసి రాష్ట్ర నాయకులు మేకల ప్రసాద్,**



**తల్లాడ/డిసెంబర్24 (జర్నలిస్ట్ వార్త):**క్షమా గుణాన్నీ బోధించిన దేవుడు కేవలం క్రీస్తు మాత్రమే అనిటిసిసి రాష్ట్ర నాయకులు మేకల ప్రసాద్ అన్నారు. ప్రేమా భావాన్ని, సేవాతత్పరతను, క్షమా గుణాన్నీ బోధించిన క్రీస్తు జన్మదినం సందర్భంగా క్రైస్తవులకు అత్యంత సంతోషకరమైన రోజు అని పేర్కొన్నారు. పర్వదినం క్రిస్టియన్ సోదరుల అందరికి శుభం చేకూరాలని, కుటుంబ సమేతంగా సుఖసంతోషాలతో క్రిస్మస్ వేడుక జరుపుకోవాలని ,ఆకాంక్షించారు. యేసు క్రీస్తు దీవెనలు ప్రతి ఒక్కరికీ లభించాలని, అందరూ సంతోషంగా జీవించాలని ప్రార్థించారు.

## తల్లాడ పట్టణ ప్రజలకు క్రిస్టమస్ శుభాకాంక్షలు తెలిపిన సర్పంచ్ పెరిక నాగేశ్వర రావు



**తల్లాడ/డిసెంబర్24(జర్నలిస్ట్ వార్త):**
తల్లాడ పట్టణ ప్రజలందరికి క్రిస్టమస్ శుభాకాంక్షలు తెలిపిన సర్పంచ్ పెరిక నాగేశ్వరరావు , ఈ సందర్భంగా సర్పంచ్ చిన్నబ్బాయి మాట్లాడుతూ ప్రేమ కరుణ ద్వారా ప్రపంచ మానవాళిలో ఆనందం నింపిన ఏసుక్రీస్తు జీవితం అందరికీ ఆదర్శప్రాయం ఏసుక్రీస్తు జన్మదినమైన క్రిస్టమస్ పర్వదినాన్ని ప్రజలంతా సుఖసంతోషాలతో జరుపుకోవాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను. ఈ క్రిస్టమస్ పండుగ మీ ఇంట్లో ప్రేమ ఆప్యాయతలు సుఖ సంతోషాలను నింపాలని ఆకాంక్షిస్తూ ప్రతి ఒక్కరికి క్రిస్టమస్ శుభాకాంక్షలు తెలిపారు.



## డాన్ బోస్కో పాఠశాల పినపాకాలో ఘనంగా సెమీ క్రిస్మస్ ఉత్సవాలు

**తల్లాడ/డిసెంబర్24(జర్నలిస్ట్ వార్త):** తల్లాడ మండలంలోని పినపాక నందలి డాన్ బోస్కో స్కూల్లో సెమీ క్రిస్మస్ సంబరాలు ఆకాశాన్ని అంటుకున్నాయి.

క్రీస్తు జయంతి ఉత్సవాన్ని పురస్కరించుకొని పాఠశాల యాజమాన్యం, సిబ్బంది, విద్యార్థులు, తల్లిదండ్రులు మరియు శ్రేయోభిలాషులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ వేడుకలలో విద్యార్థులు చక్కని నృత్యాలతో క్రీస్తు ప్రభువు జనన పరమార్థాన్ని ప్రదర్శించారు. ఈ వేడుకలలో పాఠశాల ప్రిన్సిపల్, కరస్పాండెంట్ ఫాదర్ ఏరువ ప్రదీప్ రెడ్డి , వైస్ రెక్టర్ మరియు విచారణ గురువు ఫాదర్ రాజేష్ , అడ్మినిస్ట్రేటర్ ఫాదర్ రాజీవ్ , డీన్ ఫాదర్ డేవిడ్ సుందర్ అతిథులుగా పాల్గొని తమ అమూల్యమైన సందేశాలను, దీవెనలను మరియు క్రిస్మస్ గీతాలతో అలరించారు. ఈ ఉత్సవాల్లో భాగంగా పాఠశాల బోధన- బోధనేతర సిబ్బందికి క్రిస్మస్ ప్రేమ కానుకగా బహుమతులను అందజేశారు. క్రీస్తు జయంతి పండుగకు చిహ్నంగా క్రిస్మస్ కేకులు కట్ చేసి అందరకు అందజేశారు. ఈ మధురమైన సందర్భమును జాతీయగీతంతో ముగించారు.



## ఖమ్మం జిల్లా తెలుగుదేశం పార్టీ ప్రజలందరికీ క్రిస్మస్ శుభాకాంక్షలు

**తల్లాడ/డిసెంబర్24(జర్నలిస్ట్ వార్త):** ఖమ్మం జిల్లా ప్రజలందరూఏసు మార్గంలో నడిచిన క్రిస్మస్ పండుగేప్రతి ఒక్కరూ సంతోషంగా క్రిస్మస్ జరుపుకోవాలన్న తెలుగుదేశం పార్టీ వాసిరెడ్డి రామనాథం ప్రేమ,కరుణ,సేవలతో కూడిన శాంతియుత జీవన మార్గాన్ని ప్రపంచానికి అందించిన ఏసుక్రీస్తు జన్మదినం సందర్భంగా ప్రజలందరికీ క్రిస్మస్ శుభాకాంక్షలు. ఏసు చూపించిన నిస్వార్థ సేవా మార్గంలో నడిచిన క్రిస్మస్ వేడుక లు తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షుడు సరికొండ శ్రీనివాసరావు తెలిపారు. కరుణామయునిగా పిలువబడుచున్న ఏసు చూపిన మార్గంలో నడుస్తూ ప్రజలందరిపట్లా కరుణ, ప్రేమతో మెలుగుదామన్నారు. ఈ సందర్భంగా క్రిస్మస్ వేడుకను ప్రజలంతా కలసికట్టుగా జరుపుకోవాలని ధూపాటిభద్రరాజు, రావూరి రవి ప్రసాద్, నారా పోగు ప్రసాద్, నాగేశ్వరరావు, రామారావు, సత్యనారాయణ, ఒక్క కృష్ణార్జునరావ్, తేలపుట్లవెంకటేశ్వర్లు, ఆకాంక్షించారు.



## ఆశ్రమలో అన్నదాన కార్యక్రమం నిర్వహించిన వారు, కుటుంబ సభ్యులు



**మధుర/డిసెంబర్24(జర్నలిస్ట్ వార్త):** మధిర వాస్తవ్యులు పాతూరి సూర్యనారాయణ రాజు వర్ధంతి సందర్భంగా వారి కుమారుడు పాతూరి సాంబశివరాజు వారి కుటుంబ సభ్యులు మధిర లోని మదర్ థెరిస్సా సేవాసదనము మానసిక దివ్యాంగుల పునరావాస కేంద్రం ముందు అన్న వితరణ చేసినారు. సూర్యనారాయణ రాజు పవిత్ర ఆత్మకు విశ్రాంతి కలగాలని, వారి కుటుంబ సభ్యులకు ఆదరణ ఓదార్పును ఇవ్వాలని కోరుకుంటూ మానసిక దివ్యాంగ పిల్లలకు దేవుని ప్రార్థిస్తున్నామ సాంబశివరాజు నాన్నగారు సూర్యనారాయణ రాజు వర్ధంతి సందర్భమును మానసిక దివ్యాంగ పిల్లలతో పంచుకోవాలని వారికి అన్న వితరణ చేసినందుకు మీకు హృదయపూర్వక ధన్యవాదాలు కృతజ్ఞతలు తెలిపారు.

## గొల్లగూడెం పంచాయతీ వార్డు నెంబర్ ప్రమాణస్వీకారం



**తల్లాడ/డిసెంబర్24(జర్నలిస్ట్ వార్త):** సర్పంచ్ ఎన్నికల్లో కాంగ్రెస్, తెలుగుదేశం పార్టీ తరుపున గొల్లగూడెం గ్రామంలో వార్డ్ మెంబర్ పంచాయతీ ఎన్నికల్లోగెలుపొంది గ్రామపంచాయతీ ఆఫీస్ నందు గ్రామ సెక్రెటరీ పరుశురాం ఆధ్వర్యంలో ప్రమాణస్వీకారం చేయడం జరిగినది
1వ వార్డు మేరుగు రాజేశ్వరి 2వ ఇస్నేపల్లిలివెంకటేశ్వర్లు 3వ గొల్లమందల శ్రీనివాసరావు సుబ్బు 5వ తేల్లపుట్ట వెంకటి ప్రమాణస్వీకారం చేయడం జరిగింది వారితోపాటు గ్రామ ప్రజలు నాయకులు పాల్గొన్నారు.

# యేసు బోధనలు విద్యార్థులకు స్ఫూర్తి దాయకం.

## విశ్వశాంతిలో క్రీస్తు జన్మదిన వేడుకలు.



**సత్తుపల్లి/డిసెంబర్24(జర్నలిస్ట్ వార్త):**
యేసు క్రీస్తు బోధనలు విద్యార్థుల చదువు, ప్రవర్తన, జీవిత లక్ష్యాలను తీర్చిదిద్దడంలో సహాయపడతాయనీ విశ్వశాంతి విద్యాలయం ప్రిన్సిపల్ పసుపులేటి నాగేశ్వరరావు అన్నారు.బుధవారం విశ్వశాంతి లో ముందస్తు క్రిస్టమస్ వేడుకలు జరిగాయి. క్రీస్తు ఖ్యాతిని గుర్తు చేసే గీతాలకు నృత్యాలు చేశారు. కేకు కట్ చేసి క్రిస్టమస్ శుభాకాంక్షలు తెలిపారు. నాగేశ్వరరావు మాట్లాడుతూ... ఈ బోధనలు అలవర్చుకుంటే విద్యార్థులు స్నేహితులతో, ఉపాధ్యాయులతో సౌహార్దంగా ఉండడం నేర్చుకుంటారు.ప్రేమ, దయ, సేవాభావం,క్షమ గుణం వలన కోపం, ద్వేషం తగ్గి మంచి మనసు కలుగుతుందన్నారు. విద్యార్థులు అహంకారం లేకుండా వినయం, సహాయం చేయడం ,ఆత్మవిశ్వాసం , ధైర్యం, సహనం, క్రమశిక్షణ, ఇతరులను గౌరవించడం అలవర్చుకోవాలని సూచించారు.మంచి జీవన మార్గం,మంచి ఆలోచనలు అలవరచుకున్నవారు మంచి పౌరులుగా ఎదుగుతారని అన్నారు.యేసు బోధనలు విద్యార్థుల్లోమంచి వ్యక్తిత్వం, నైతిక విలువలు, ఆత్మవిశ్వాసం పెంచి,వారిని విజయవంతమైన, మానవత్వం గల వ్యక్తులుగా తయారు చేస్తాయని పేర్కొన్నారు.యేసు క్రీస్తు ప్రపంచానికి ప్రేమ, శాంతి, క్షమ అనే గొప్ప విలువలను బోధించారు."ప్రేమించండి సేవ చేయండి క్షమించండి" అన్నది ఆయన జీవిత సందేశం అన్నారు.యేసు బోధించిన ప్రేమ వల్ల మనం ఇతరులను గౌరవించడం నేర్చుకుంటాం.క్షమ వల్ల కోపం, ద్వేషం దూరమవుతాయి.నిజాయితీ వల్ల మన జీవితం వెలుగొందుతుందన్నారు.క్రిస్మస్ ట్రీ, కేక్, స్టార్ ప్రాధాన్యతలను వివరించారు.









# అంతర్జాతీయ సదస్సుకు

## డాక్టర్ సంకినేని వెంకటయ్యకు ఆహ్వానం

**వర్ధన్నపేట/డిసెంబర్ 24(జర్నలిస్ట్ వార్త):**
భారత రాజకీయ శాస్త్ర సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 27, 28 తేదీలలో ఒడిశా రాష్ట్రం భువనేశ్వర్‌లోని కళింగ విశ్వవిద్యాలయంలో అంతర్జాతీయ సదస్సు నిర్వహించనున్నారు. ఈ సదస్సులో "భారతదేశంలోని సామాజిక ఉద్యమాలు %-% ఒక సమీక్ష" అనే అంశంపై పరిశోధనా పత్రం సమర్పించేందుకు కాకతీయ విశ్వవిద్యాలయం రాజకీయ శాస్త్ర విభాగాధిపతి డాక్టర్ సంకినేని వెంకటయ్యకు ఆహ్వానం అందింది.వరంగల్ జిల్లా వర్ధన్నపేట మండలం ల్యాబర్తి గ్రామానికి చెందిన డాక్టర్ సంకినేని వెంకటయ్య, రాజకీయ శాస్త్ర రంగంలో చేసిన విశిష్ట సేవలు, పరిశోధనలకు గుర్తింపుగా ఈ ఆహ్వానం లభించడం విశేషం.ఈ అంతర్జాతీయ సదస్సులో డాక్టర్ సంకినేని వెంకటయ్యతో పాటు అధ్యయన మండలి అధ్యక్షుడు డాక్టర్ జి. కృష్ణయ్య, అధ్యాపక బృందానికి చెందిన డాక్టర్ వడ్లకొండ సత్యనారాయణ, వాడపల్లి నాగరాజు పాల్గొననున్నారు. అలాగే పరిశోధన విద్యార్థులు అంకెల్ల శంకర్, కళ్లేపల్లి ప్రశాంత్, రుబీన, కరిష్మా చందర్, వంశీతో పాటు వివిధ కళాశాలలకు చెందిన మొత్తం ఇరవై ఐదు మంది రాజకీయ శాస్త్ర అధ్యాపకులు హాజరై పలు అంశాలపై పరిశోధనా పత్రాలు సమర్పించనున్నారు.ఈ సదస్సు ద్వారా దేశీయ, అంతర్జాతీయ స్థాయిలో సామాజిక ఉద్యమాలు, ప్రజాస్వామ్య పరిణామాలపై విస్తృత చర్చ జరగనుందని, కాకతీయ విశ్వవిద్యాలయానికి చెందిన అధ్యాపకులు, పరిశోధకుల ప్రతిభకు మరింత గుర్తింపు లభించనుందని విద్యావర్గాలు అభిప్రాయపడుతున్నాయి.




# నూతన సర్పంచులకు సమస్యల స్వాగతం..?




**అనంతగిరి :డిసెంబర్24(జర్నలిస్ట్ వార్త):**
సర్పంచ్ బరిలో నిలిచి ప్రజల విశ్వాసాన్ని పొంది విజయం సాధించిన నూతన సర్పంచులు, గ్రామ పాలకులు సోమవారం అధికారికంగా పగ్గాలు చేపట్టారు. ప్రమాణ స్వీకారోత్సవాల సందర్భంగా గ్రామపంచాయతీ కార్యాలయాలు పండుగ వాతావరణాన్ని సంతరించుకున్నప్పటికీ, పాలన పరంగా మాత్రం రెండేళ్లుగా పేరుకుపోయిన సమస్యలు నూతన ప్రజాప్రతినిధులకు స్వాగతం పలుకుతున్నాయి.గ్రామాల్లో మౌలిక సదుపాయాల లోపం, తాగునీటి సమస్యలు, అంతర్గత రహదారుల దుస్థితి, పారిశుధ్య లోపాలు వంటి సమస్యలు పరిష్కారం కోసం ఎదురుచూస్తున్నాయి. మరోవైపు పంచాయతీలకు తగిన నిధులు అందకపోవడంతో కొన్ని పనులను కార్యదర్శులు తమ జేబుల నుంచి ఖర్చు చేస్తూ ముందుకు తీసుకెళ్లాల్సిన పరిస్థితి నెలకొన్నదని వారు వాపోతున్నారు.ఇలాంటి పరిస్థితుల్లో నూతనంగా బాధ్యతలు చేపట్టిన ప్రజాప్రతినిధులకు పాలన ఒక పెద్ద సవాలుగా మారింది. ప్రభుత్వ సహకారం, సమయానికి నిధుల విడుదల, అధికారుల సమన్వయంతోనే గ్రామ అభివృద్ధి సాధ్యమవుతుందని స్థానికులు అభిప్రాయపడుతున్నారు.ప్రజల ఆకాంక్షలకు తగ్గట్టుగా సమస్యలను ఎదుర్కొని, పరిష్కార దిశగా అడుగులు వేస్తేనే నూతన పాలకవర్గాలకు నిజమైన గుర్తింపు లభిస్తుందన్న అభిప్రాయం గ్రామాల్లో వినిపిస్తోంది.

## విశాఖ ఆఫీస్ అటెండర్‌కు రూ. కోటి ఆస్తులు..

### ఏసీబీ సోదాల్లో షాకింగ్ నిజాలు



విశాఖపట్నం **డిసెంబర్24(జర్నలిస్ట్ వార్త):**
విశాఖపట్నం జిల్లాలోని ప్రభుత్వ కార్యాలయాల్లో అవినీతి ఎంత లోతుగా పాతుకుపోయిందో ఏసీబీ (అవినీతి నిరోధక శాఖ) సోదాల్లో బయటపడుతోంది. నవంబర్ నెలలో సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల్లో చేపట్టిన తనిఖీల దర్యాప్తు కొనసాగుతున్న క్రమంలో విస్తుపోయే అంశాలు వెలుగులోకి వస్తున్నాయి. ఈ దర్యాప్తులో భాగంగా నిన్న ఏసీబీ అధికారులు పలువురు ఉద్యోగుల నివాసాల్లో సోదాలు నిర్వహించారు.సూపర్‌బజార్ రిజిస్ట్రేషన్ కార్యాలయంలో అటెండర్‌గా పనిచేస్తున్న ఆనంద్‌కుమార్ ఇంట్లో ఏసీబీ అధికారులు సుమారు రూ. కోటి విలువైన స్థిర, చరాస్తులను గుర్తించి షాక్‌కు గురయ్యారు. ఒక అటెండర్ స్థాయిలో పనిచేసే వ్యక్తి ఇంత భారీ ఆస్తులు ఎలా కూడబెట్టాడనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. అదే కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న సుధారాణి నివాసంలోనూ దాదాపు కోటి రూపాయల విలువైన ఆస్తులకు సంబంధించిన పత్రాలను అధికారులు గుర్తించారు.ఇక సబ్‌రిజిస్ట్రార్ మోహనరావు నివాసంలోనూ స్థిరాస్తులు, చరాస్తులకు సంబంధించిన కీలక డాక్యుమెంట్లు స్వాధీనం చేసుకున్నారు. ఈ తనిఖీల్లో నగదు, బంగారు ఆభరణాలు, రిజిస్ట్రేషన్‌కు సంబంధించిన ముఖ్యమైన పత్రాలు లభించడంతో అధికారులు దర్యాప్తును మరింత విస్తృతం చేశారు.

## జగన్‌కు జ్వరం..కార్యక్రమాలు రద్దు

పులివెందుల **డిసెంబర్24(జర్నలిస్ట్ వార్త):** వైసిపి అధినేత వైఎస్.జగన్ స్వల్ప అస్వస్థతకు గురయ్యారు. జ్వరంతో బాధపడుతున్న కారణంగా డాక్టర్ల సూచన మేరకు బుధవారం)కార్యక్రమాలను రద్దు చేసుకున్నారు. ఈ మేరకు వైసిపి ఎక్స్ వేదికగా ఈ ప్రకటనను విడుదల చేసింది. పులివెందుల పర్యటనలో భాగంగా వైఎస్ జగన్ ఇడుపులపాయలో ప్రార్థనల్లో పాల్గొనాల్సి ఉంది. అలాగే, మధ్యాహ్నం పులివెందుల క్యాంపు కార్యాలయంలో ప్రజలకు అందుబాటులో ఉండాల్సి ఉండగా, అనారోగ్యం కారణంగా ఈ కార్యక్రమాలు రద్దయ్యాయి. క్రిస్మస్ సందర్భంగా గురువారం పులివెందుల సీఎస్ఐ చర్చి క్రిస్టమస్ వేడుకల్లో వైఎస్ జగన్ పాల్గొనే అవకాశం ఉంది.

## ఎఐ సాయంతో హైటెక్ కాపీయంగ్

### ఎట్టకేలకు పట్టుబడ్డ ఇద్దరు యువకులు -ఆలస్యంగా వెలుగుచూసిన ఘటన

హైదరాబాద్,**డిసెంబర్24(జర్నలిస్ట్ వార్త)::** ఎఐ సాయంతో నకలు కొట్టబోయి దొరికిన ఓ యువకుడి వ్యవహారం ఆలస్యంగా వెలుగుచూసింది. గతంలో నేరుగా చిట్టీలతో కాపీ కొట్టేవారు. ఇప్పుడు ఎఐ వచ్చింది. ఈ ఎఐ టెక్నాలజీని వాడి పరీక్షల్లో కాపీ కొట్టేద్దామనుకున్న ఇద్దరు యువకులను అధికారులు గుర్తించారు. ఈ ఘటన గత ఆదివారం హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో జరిగింది. గచ్చిబౌలిలోని హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ నాన్–టీచింగ్ విభాగంలో జూనియర్ ఆఫీస్ అసిస్టెంట్ ఉద్యోగ నియామకాల కోసం ఇటీవల నోటిఫికేషన్ విడుదలయ్యింది. ఈ మేరకు ఈ నెల 21వ తేదీన ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు యూనివర్సిటీ క్యాంపస్‌లో రాత పరీక్ష నిర్వహించారు. ఈ పరీక్షకు హర్యానాకి చెందిన అనిల్ (30) హాజరయ్యాడు. పరీక్ష రాస్తున్న సమయంలో అతని చెవిలో ఉన్న బ్లూటూత్ డివైస్ నుంచి పదేపదే బీప్ సౌండ్ రావడంతో ఇన్విజిలేటర్ కు అనుమానం వచ్చి వెంటనే ఆ యువకుడిని తనిఖీ చేశారు. ఆ సోదాలో అనిల్ షర్ట్‌కు అమర్చిన స్కానర్ డివైస్ బయటపడింది. అనిల్ క్వశ్చన్ పేపర్‌ను ఆ స్కానర్ ద్వారా స్కాన్ చేసి, బాత్‌రూంకు వెళ్లి ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సాయంతో సమాధానాలు తెలుసుకుని, చెవిలో ఉన్న బ్లూటూత్ ద్వారా వాటిని వింటూ జవాబులు రాస్తున్నట్లు అధికారులు గుర్తించారు. ఈ ఘటనతో అప్రమత్తమైన యూనివర్సిటీ అధికారులు పరీక్ష హాలులోని ఇతర అభ్యర్థులను కూడా నిశితంగా పరిశీలించారు. సోదాలు చేశారు. ఈ క్రమంలోనే హర్యానాకు చెందిన మరో యువకుడు సతీష్ కూడా ఇదే తరహాలో హైటెక్ పద్ధతిలో కాపీ చేస్తున్నట్లు గుర్తించారు. దీంతో ఇద్దరు యువకులను అదుపులోకి తీసుకున్న వర్సిటీ అధికారులు, వారిని గచ్చిబౌలి పోలీసులకు అప్పగించారు. హెచ్‌సీయూ రిజిస్ట్రార్ దేవేష్ నిగమ్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. నిందితులను అరెస్టు చేసిన పోలీసులు? అనంతరం రిమాండ్‌కు తరలించారు. ఈ ఘటనతో ఉద్యోగ పరీక్షల్లో హైటెక్ కాపీయింగ్ ముప్పు మరోసారి వెలుగుచూసింది. ఆధునిక సాంకేతికతను అక్రమ మార్గాల్లో వినియోగిస్తూ పరీక్షల విశ్వసనీయతను దెబ్బతీస్తున్న ఘటనలపై కఠిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని విద్యా వర్గాలు అభిప్రాయపడుతున్నాయి.

# బాలపేట గ్రామంలో ఘనంగా బిఆర్ఎస్ విజయోత్సవ సభ..

### హాజరైన సత్తుపల్లి మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్య ..

**తల్లాడ/డిసెంబర్ 24 (జర్నలిస్ట్ వార్త):**
బాలపేట మాజీ సర్పంచ్,మాజీ ఎంపీపీ దొడ్డ శ్రీనివాసరావు ప్రధాన అనుచరుడు కోసూరి వెంకట నరసింహారావు నేతృత్వంలో బుధవారం బాలపేట గ్రామంలో బిఆర్ఎస్ పార్టీ విజయోత్సవ సభ ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమం బాలపేట గ్రామ సర్పంచ్ గా కోసూరి ధనలక్ష్మి ఇటీవల జరిగిన పంచాయతీ ఎన్నికల్లో అఖండ విజయం సాధించిన సందర్భంగా ఆ గ్రామ బిఆర్ఎస్ శ్రేణులు విజయోత్సవ ర్యాలీ, అనంతరం సభ నిర్వహించారు.ఈ కార్యక్రమానికి సత్తుపల్లి మాజీఎమ్మెల్యే, బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు సండ్ర వెంకట వీరయ్య హాజరై ఎన్నికల్లో అత్యధిక మెజారిటీతో విజయం సాధించిన సర్పంచ్ ధనలక్ష్మిని శాలువ కప్పి,పూలమాలలు అందించి ఘనంగా సన్మానించి, సత్కరించారు. అనంతరం ఉప సర్పంచ్ అమరయ్యను మరియు పాలకవర్గాన్ని సన్మానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తల్లాడ మాజీ ఎంపీపీ, బిఆర్ఎస్ పార్టీ తల్లాడ మండల నాయకులు దొడ్డ శ్రీనివాసరావు కోరిన మేరకు ఈ గ్రామాన్ని ప్రత్యేక శ్రద్ధ తీసుకొని అనేక అభివృద్ధి,సంక్షేమ రంగాలలో కెసిఆర్ ఆశీస్సులతో జిల్లాలోనే ముందు వరుసలో ఉంచాము.ఈ గ్రామాన్ని మరింత అభివృద్ధి పథంలో నడపాలన్న ఆకాంక్ష, ఆలోచన నాలో ఎప్పుడూ ఉంటూనే ఉంటుంది.మీరూ మీ పాలకవర్గమంతా ఒకరికొకరు సహకారంతో, సమన్వయంతో గ్రామాన్ని అభివృద్ధి చేసుకునేందుకు ప్రతి ఒక్కరు సహకరించాలని ఈ సందర్భంగా ఆయన నూతన పాలకవర్గాన్ని కోరారు.మాజీ ఎంపీపీ దొడ్డ శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన ఈ సభ,విజయోత్సవ



ర్యాలీ కోలాట నృత్యాలతో,డప్పు వాయిద్యాలతో,డిజె సాంగ్స్ తో గ్రామం మార్మోగేలా కొనసాగింది.ఈ కార్యక్రమాన్ని సూత్రప్రాయంగా నడిపించిన దొడ్డ శ్రీనివాసరావును ఈ సందర్భంగా సండ్ర అభినందించారు.
ఈ కార్యక్రమంలో ఆయన వెంట తల్లాడ మాజీ ఎంపీపీ దొడ్డ శ్రీనివాసరావు, బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు వీర మోహన్ రెడ్డి,ఆ పార్టీ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ దుగ్గీదేవర వెంకటలాల్,బాలపేట, అన్నారుగూడెం గ్రామాల సర్పంచులు కోసూరి ధనలక్ష్మి,గొడ్ల ప్రభాకర్,నాయకులు మువ్వ మురళీధర్ రావు,వజ్రాల రామిరెడ్డి, బీసీ నాయకులు కోడూరి వీర కృష్ణ, జివిఆర్,కోసూరి వెంకట నరసింహారావు,దొడ్డ చిన్న శ్రీనివాసరావు, మారెళ్ళ దేవేందర్, తుమ్మలపల్లి వెంకటేశ్వరరావు,పేరసాని నరసింహారావు, పడాల శ్రీనివాసరావు, గజ్జెల మోహనరావు,నంద్యాల పుల్లయ్య,చిట్టెం నరసింహారావు,గొడ్ల వెంకటేశ్వర్లు,స్థానిక గ్రామ నాయకులు, బిఆర్ ఎస్ కార్యకర్తలు, సండ్ర అభిమానులు, దొడ్డ శ్రీనివాసరావు అనుచరులు తదితరులు అధికంగా పాల్గొన్నారు.

# కరుణామయుడి జన్మదినం...

### ప్రపంచవ్యాప్తంగా వందల కోట్ల మందికి సంబరం.

**డిసెంబర్24(జర్నలిస్ట్ వార్త):**
పవిత్రస్థలాల్లో ప్రార్థనలు, మంద్రంగా వినిపించే చర్చి గంటలు, దేదీప్యమానంగా వెలిగే కొవ్వొత్తులూ, ఇంటింటా మెరిసే నక్షత్రకాంతులు, విద్యుద్దీపాలంకరణలు, చవులూరించే ప్లమ్ కేకులూ పుడ్డింగులు, వెలుగుజిలుగుల ఫర్ చెట్లూ, వాటి చెంతనే కానుకల్ని పంచే శాంటా క్లాజ్... క్రిస్మస్ పండగంటేనే ఆనందోత్సాహాలు మేళవించిన అతి పెద్ద ఉత్సవం!

### క్రిస్మస్ పండుగ!

యేసుక్రీస్తు పుట్టినరోజే క్రిస్మస్ పండగ అని ఆ రోజున ప్రపంచవ్యాప్తంగా వేడుకలు చేసుకుంటారని తెలిసిందే. కానీ ఈ పండుగకి మూలం పూర్వం రోమన్లు జరుపుకునే 'సాటర్నాలియా' పండుగ. చలికి కాంతిని కోల్పోయిన సూర్యుడిని మళ్లీ బలం పుంజుకుని రమ్మని వేడుకుంటూ ఆ రోజునే పండగ చేసుకునేవారట. క్రీ.శ.350వ సంవత్సరంలో రోమ్ బిషప్ అయిన పోప్ జూలియస్ డిసెంబర్ 25ని క్రిస్మస్ పర్వదినంగా ప్రకటించాడు. ఆ రోజు నుంచి ఈ వేడుకలను జనవరి 5 వరకూ అంటే 12 రోజులపాటు జరుపుకుంటే, జులియన్ క్యాలెండర్‌ను అనుసరించే దేశాల్లో మాత్రం జనవరి 7 నుంచి 19 వరకూ పండుగ చేసుకుంటారు. నిజానికి జీసస్ జన్మదినం గురించి బైబిల్లో కచ్చితమైన సమాచారం లేదు. కానీ క్రైస్తవులంతా ఈరోజును పవిత్రమైనదిగా భావించి ఇంట్లో క్రిస్మస్ ట్రీని అలంకరించడం, కేరల్స్ పాడటం, చర్చిలకు వెళ్లి బైబిల్ చదవడంతోపాటు బహుమతులు ఇచ్చిపుచ్చుకుంటూ ఆనందంగా గడుపుతారు. ఆ రోజున దేవుడి రూపాలైన పిల్లలకు కానుకలు ఇవ్వడం మంచిదిగా భావిస్తారు. అందుకే 'కానుకలు లేందే క్రిస్మస్ లేదు' అంటారు.



### ఎక్కడెక్కడ..!

క్రిస్మస్‌ను అందరికన్నా బాగా ఫిలిప్పీన్స్ వాసులు సుమారు నాలుగు నెలలపాటు జరుపుకుంటారు. సెప్టెంబరు ఒకటిన మొదలైన వేడుకలు జనవరి 6న ఎపిఫనీ (బాల ఏసుని చూసేందుకు ముగ్గురు తూర్పుదేశపు జ్ఞానులు కానుకలు మూట కట్టుకుని, ప్రకాశిస్తున్న నక్షత్రాన్ని చూస్తూ బెత్లహేంకి చేరుకునే రోజు) వరకూ కొనసాగుతాయి. బ్రిటన్ వాళ్లకి టర్కీ (గిన్నెకోడి) లేకుండా క్రిస్మస్ పూర్తి కాదు. ఆ కోడి కూరని తినేసి అందులో వై ఆకారంలో ఉండే విష్బన్‌ను బయటకు తీసి, దాన్ని అటొకరూ ఇటొకరూ పట్టుకుని గట్టిగా లాగితే, అది విరిగి ఎవరి చేతిలోకి పెద్ద ఎముక వస్తే వాళ్ల కోరికలు తీరతాయన్నది వాళ్ల నమ్మకమం. బెత్లహేం నగరానికి చేరుకున్న క్రీస్తు తల్లితండ్రులు కాసింత చోటుకోసం ప్రతి గడపా తొక్కి ఎవరూ ఆశ్రయం ఇవ్వకపోవడంతో చివరకు పశువుల కొట్టంలో తలదాచుకున్న దృశ్యాన్ని చూడాలంటే మెక్సికోకి వెళ్లాల్సిందే. ఆ రోజున వాళ్లు బృందాలుగా ఏర్పడి ఇళ్లిల్లు తిరుగుతారు. బొలీవియాలో అర్ధరాత్రివేళ కోడిపుంజులను తీసుకొచ్చి అరిపిస్తారు. క్రీస్తు జననం ప్రపంచానికి మొదటగా తెలిసింది కోడికూత వల్లేనన్నది వాళ్ల నమ్మకం. ఇలా ఒక్కోచోట ఒక్కో రకమైన సంప్రదాయాన్ని పాటిస్తూ జరుపుకునే వేడుకే క్రిస్మస్.

**పవిత్రగ్రంథం :** క్రైస్తవులు బైబిల్ పఠనంతోనే క్రీస్తుని ప్రార్థిస్తారు. పరిశుద్ధాత్మకు ప్రతినిధులుగా చెప్పే 40 మంది రచయితలు బైబిల్ సృష్టికర్తలు. ఇది మొత్తం 66 పుస్తకాలుగా ఉంటుంది. అందులో 39 పుస్తకాలను ఓల్డ్ టెస్టమెంట్ అనీ 27 పుస్తకాలను న్యూ టెస్టమెంట్ అని అంటారు. మొదటి ఐదు పుస్తకాలను మోజెస్ రాశాడు. అందుకే ఆయన్ని బైబిల్‌కి ఆద్యుడుగా పేర్కొంటారు. క్రీ.పూ.1450 నుంచి క్రీ.శ.100 సంవత్సరం వరకు... అంటే జీసస్ పుట్టి కనుమూసి మళ్లీ పునర్జీవించేవరకు ఇందులో ఉంటుంది. ముద్రణ యంత్రం కనుగొన్నాక అచ్చయిన తొలి గ్రంథం బైబిలే. ప్రపంచవ్యాప్తంగా వెయ్యికి పైగా భాషల్లోకి అనువదించబడి, నిమిషానికి 50 పుస్తకాల చొప్పున అమ్ముడుపోవడంతోపాటు అత్యధికంగా దొంగిలించబడే గ్రంథం కూడా ఇదే!

### క్రిస్మస్ చెట్టు!

క్రిస్మస్‌కి మారుపేరు అనేంతగా క్రిస్మస్ ట్రీ (ఫర్ లేదా పైన్ చెట్టు) రూపం స్థిరపడిపోయింది. చిన్నదో పెద్దదో ఓ చెట్టుని అలంకరించే సంప్రదాయం అంతటా వేళ్లూనుకుంది. అయితే మంచుతో మోడుబారిన చెట్లన్నీ మళ్లీ వసంతంలో చిగురిస్తాయన్నది స్ఫురించేలా ఇంట్లో పచ్చని చెట్టుని పెట్టడం ప్రాచీన ఈజిప్షియన్లూ, రోమన్ల కాలం నుంచి ఉంది. మొదట్లో క్రిస్మస్ చెట్టుని ఆడమ్, ఈవ్లకు గుర్తుగా ఆపిల్స్‌తోనే అలంకరించేవారు.

# ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విజినరీ నేత

**నిజామాబాద్‌లో అత్యధిక సర్పంచ్‌ల గెలుపు**

**రాబోయే స్థానిక ఎన్నికల్లోనూ సత్తా చాటుతాం**

**కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చే జీవోలు పారదర్శకం**

**టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమర్ గౌడ్**

నిజామాబాద్, **డిసెంబర్24(జర్నలిస్ట్ వార్త):**రాష్ట్రంలో అత్యధిక కాంగ్రెస్ సర్పంచులు నిజామాబాద్ జిల్లాలోనే గెలుపొందారని.. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లోనూ సత్తా చాటుతామని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ ధీమా వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చే జీవోలు పారదర్శకంగా ఉంటాయన్నారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో ఒక్క జీవోను కూడా బహిర్గతం చేయలేదన్నారు.రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఒక విజన్ ఉన్న నాయకుడని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమర్ గౌడ్ అన్నారు. రాష్ట్ర అభివృద్ధి, ప్రజా సంక్షేమమే లక్ష్యంగా సీఎం రేవంత్ రెడ్డి పాలన కొనసాగిస్తున్నారని పేర్కొన్నారు. గ్లోబల్ సమ్మిట్‌లో రూ.1.70 లక్షల కోట్లు విలువైన పెట్టుబడులకు ఒప్పందం కుదరడం ఇందుకు ఉదాహరణ అని అన్నారు. ప్రజా ప్రభుత్వం పాలనలో పదేళ్ల విధ్వంసం నుంచి వికాసం దిశగా ముందుకు వెళ్తున్నామని వెల్లడించారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై అనవసరంగా విమర్శలు చేస్తే చూస్తూ ఊరుకోమని హెచ్చరించారు. కేసీఆర్ నోరు జారి మాట్లాడితే తమ ప్రతాపం చూపిస్తామని మందలించారు. ఆయనలా దిగజారి తాము మాట్లాడమని చెప్పుకొచ్చారు. ప్రజలే కేసీఆర్ అండ్ కోకు బుద్ధి చెబుతారని వార్నింగ్




ఇచ్చారు. ప్రజలకు మంచి చేస్తున్న తమ ప్రభుత్వంపై బీఆర్ఎస్ నాయకులు విషం కక్కుతున్నారని ధ్వజమెత్తారు. తమ ప్రభుత్వంలో ప్రతి పైసా ప్రజల కోసమే ఖర్చు చేస్తున్నామని స్పష్టం చేశారు. ఒక్క రూపాయి కూడా తాము దుర్వినియోగం చేయట్లేదని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తోందని వ్యాఖ్యానించారు. రైతులకు అవసరమైన విద్యుత్తు అందించేందుకు సబ్‌స్టేషన్లు ఏర్పాటు చేస్తున్నామని పేర్కొన్నారు. రైతులు సాగు చేసిన పంటలకు అవసరమైన నీరు అందించాలంటే విద్యుత్తు ఎంతో అవసరమని వివరించారు. ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిని చూసి గ్రామ పంచాయతీ ఎన్నికల్లో కాంగ్రెస్‌ను ప్రజలు ఆశీర్వదించారని పేర్కొన్నారు. కాంగ్రెస్‌కు ప్రజల్లో వస్తున్న ఆదరణను చూసి ఓర్వలేక ఫామ్‌హౌస్‌లో కూర్చున్న కేసీఆర్ బయటకు వచ్చి విమర్శిస్తున్నారని ఫైర్ అయ్యారు. అసెంబ్లీకి రాని ప్రతిపక్ష నేత నేడు మాయమాటలు చెబుతున్నారని ఎద్దేవా చేశారు. కేసీఆర్ అసెంబ్లీకి వచ్చే దమ్ముందా అని సవాల్ విసిరారు. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో కూడా తాము సత్తా చూపిస్తామని ధీమా వ్యక్తం చేశారు. అన్నదాతల సంక్షేమం కోసం రైతు రుణమాఫీ, రైతు భరోసా, బీమా పథకం అమలు చేస్తున్నామని మహేశ్ గౌడ్ పేర్కొన్నారు.